తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
28-04-2026
బుధవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 88
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

# సురక్షితం ఎక్కడ



- వడ్ల లోడుతో వెళ్తున్న లారీని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు
- 15 మంది ప్రయాణికులకు గాయాలు
- వన్ మెన్ సర్వీస్
- బస్సును అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం...

**కొల్చారం, ఏప్రిల్ 28 (సిరి న్యూస్)**

ఆర్టీసీ బస్సులలో వెళ్తే సురక్షితంగా గమ్యస్థానం చేరుతారని నమ్మకం అప్పుడప్పుడు జరుగుతున్న ప్రమాదాల వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు ముందు వెళ్తున్న వడ్ల లోడు లారీని వెనుక వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులు గాయాల పాలయ్యారు.

మిగతా 6వ పేజీలో..



# లంచం కోసం టేకో లాక్..!

5 శాతం కమీషన్ ఇస్తేనే వర్క్ ఓపెన్

- ఆలా ఐతేనే బిల్లులకు మోక్షం
- 'టేకో' మోడ్ పేర లక్షల్లో వసూలు
- రెండేళ్లుగా 50 కోట్ల ఎల్ఓసీలకు మోక్షం!
- ఇంజనీర్ అధికారులకు తప్పని ఇబ్బందులు
- స్టోర్‌లో సామగ్రి కొరతను ఆసరాగా తీసుకుని అక్రమాలు
- సంగారెడ్డి విద్యుత్ సర్కిల్‌లో అవినీతి ఆరోపణలు




**సిరి న్యూస్, నిఘా విభాగం:**
విద్యుత్ శాఖలో ఓ అధికారి తనకున్న అధికారాన్ని వాడుకొని గట్టిగ కాసులు దండుకుంటున్నారు. ఒక సాంకేతిక సమస్య తొలగించాలంటే ఇక్కడ అతనికే అధికారం. ఆ ఒక్క అవకాశమే ఇప్పుడు కోట్ల బిల్లుల చెల్లింపుకు అడ్డంగా మారింది. అక్కడున్నోళ్లు ఆయనకు లంచం ఇవ్వక తప్పదు లేదంటే

మిగతా 3వ పేజీలో..



# నేడే పదవ తరగతి పరీక్షల ఫలితాలు!

**తెలంగాణ బ్యూరో సిరి న్యూస్ ఏప్రిల్ 28**

తెలంగాణలో లక్షలాది మంది విద్యార్థులు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్న పదో తరగతి పరీక్షా ఫలితాల

మిగతా 3వ పేజీలో..

## ఫ్యూచర్ కోసమే
# సిటీ నిర్మాణం

ప్రపంచ దేశాలకు దీటుగా నగర ప్రణాళిక
60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ
ఓఆర్ఆర్ పెద్ద అసెట్ కానుంది
అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్
మెట్రో విస్తరణతో అద్భుత కనెక్టివిటీ
గ్రామాల ప్రజలు సిటీలో భాగం కావాలి
సిటీ కోసం ప్రజాప్రతినిధులు కృషి చేయాలి
మూడు బుల్లెట్ ట్రైన్స్ కేంద్రంగా శంషాబాద్
ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన



**హైదరాబాద్, ఏప్రిల్ 28 సిరి న్యూస్:**
ఫ్యూచర్ సిటీ భవిష్యత్ తరాలకు వరమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందరి కృషితోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ నగర నిర్మాణం అంత సులభం కాదు.. ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ఇది సాధ్యమవుతుంది అని అన్నారు. పక్కా ప్రణాళికతో ప్రపంచ నగరాలకు దీటుగా నిర్మించబోతున్నామని చెప్పారు. నూతనంగా ఏర్పాటు చేసే నగరంలో తమనూ కలపాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారని వెల్లడించారు. ప్రజల్ని అభివృద్ధిలో భాగస్వాములు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ చెప్పారు. రంగారెడ్డి జిల్లా మీర్ఖాన్‌పేట్‌లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ శంకుస్థాపన చేశారు. అలాగే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మల్కాజ్‌గిరి కమిషనరేట్ భవనం, ఆక్టోపస్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కుత్బుల్లాపూర్ డీసీపీ కార్యాలయాలను ప్రారంభించారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గతంలో చాలామంది నేతలు హైదరాబాద్ అభివృద్ధిని కొనసాగించారని

మిగతా 2వ పేజీలో..



2

# డీజీపీగా సీవీ ఆనంద్

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

# సింగరేణిని పదేళ్లలో దోచేశారు

- ఏటీఎంలా వాడుకుని వదిలేశారు
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాలా తీయించారు
- కేసీఆర్ తీరుపై మండిపడ్డ మంత్రి వివేక్




**మంచిర్యాల, ఏప్రిల్ 28 సిరి న్యూస్:**

గత పదేళ్లలో సింగరేణి సంస్థను కేవలం ఒక ఏటీఎంలా వాడుకున్నారే తప్ప కార్మికుల శ్రేయస్సును పట్టించుకోలేదని బీఆర్ఎస్ పాలకులపై మంత్రి వివేక్ వెంకటస్వామి మండిపడ్డారు. కొత్త గనుల కేటాయింపులో బీఆరఎస్

మిగతా 2వ పేజీలో..

## రైతాంగాన్ని దగా చేస్తున్న
# కాంగ్రెస్



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కాంగ్రెస్ మోసాన్ని గుర్తు చేస్తూ వరంగల్‌లో 6న సభ
- కేటీఆర్‌ను ఆహ్వానించిన ఉమ్మడి వరంగల్ నేతలు

**వరంగల్, ఏప్రిల్ 28 సిరి న్యూస్ :**
వరంగల్‌లో రైతు డిక్లరేషన్ పేరిట నాలుగేళ్ల కిందట అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా తన కపట మోసాన్ని కొనసాగిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్

మిగతా 2వ పేజీలో..



# ఆర్టీసియన్ల డిమాండ్లపై సానుకూలత

- త్వరలోనే తీపి కబురు
- టీజీఎస్ఆర్టీసీ సీఎండీ జితేష్ వి పాటిల్

2



# పర్యాటక ప్రభ పెంచుదాం

హైదరాబాద్‌లో భారీ స్థాయిలో కార్నివాల్ నిర్వహణ
పర్యాటక కేంద్రాల్లో వీకెండ్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు
పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాలి
అధికారులకు మంత్రి జూపల్లి దిశానిర్దేశం


**హైదరాబాద్, ఏప్రిల్ 28 సిరి న్యూస్ :**
దేశంలోనే అగ్రగామి పర్యాటక గమ్యస్థానంగా రాష్ట్రం ఎదిగేందుకు అత్యంత అనువైన ప్రాంతమని, ఆ దిశగా పర్యాటక రంగానికి కొత్త కళ తీసుకురావాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. మౌలిక వసతుల

మిగతా 2వ పేజీలో..

# దేశవ్యాప్తంగా కొనసాగుతున్న హీట్‌వేవ్

పెరిగిన ఎండల తీవ్రత
ఇప్పటికే వడదెబ్బకు ముగ్గురు మృతి
భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం

2





# డ్రగ్స్ కేసులో రోహిత్ రెడ్డికి బెయిల్

- రేపు జైలు నుంచి విడుదలయ్యే అవకాశం

3

# రైతాంగాన్ని దగా చేస్తున్న కాంగ్రెస్

**మొదటిపేజీ తరువాయి**



పేరిట చేసిన మోసాన్ని గుర్తు చేస్తూ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వరంగల్‌లో మే 6న నిర్వహించే బీఆర్ఎస్ సమావేశానికి కేటీఆర్‌ను పార్టీ నేతలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆ జిల్లా నేతలతో సమావేశమైన ఆయన పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు వంటి కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్ పేరిట తెలంగాణ రైతన్నలను మోసం చేసిన మే 6ని పురస్కరించుకుని కాంగ్రెస్ చేసిన మోసాన్ని ప్రజలకు గుర్తు చేసేలా రైతన్నలతో ఒక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా శాఖ ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎరువుల కొరత, విత్తనాల కొరత, ధాన్యం కొనుగోళ్లలో తీవ్రమైన సంక్షోభం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అడ్రస్ లేకుండా పోయిన రైతు ఆత్మహత్యలు కాంగ్రెస్ పాలనలో తిరిగి ప్రారంభమయ్యాయని, కరెంట్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. రైతాంగానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, పోరాటాలకు సిద్ధమవ్వాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. జిల్లాలో ధాన్యం, మొక్కజొన్నల కొనుగోలు ప్రక్రియ సక్రమంగా సాగక రైతన్నలు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారని పార్టీ నేతలు కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు వెల్లడించారు. త్వరలో జరగనున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహంపై కూడా నేతలు సుదీర్ఘంగా చర్చించారు. దీంతోపాటు ఎన్నికల సంఘం నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ('సర్') కార్యక్రమాన్ని అత్యంత ముఖ్యమైన అంశంగా పరిగణించాలని, ఈ కార్యక్రమాన్ని వినియోగించుకుని కొత్త ఓటర్లను నమోదు చేయించడంతోపాటు ఏ ఒక్క వ్యక్తి ఓటు హక్కు కోల్పోకుండా చూసే బాధ్యత తీసుకోవాలని పార్టీ నేతలను కోరారు. ఇందుకు సంబంధించి బూత్ లెవెల్ సహాయకుల జాబితాను సిద్ధం చేసి అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశం అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం 2022 మే 6న రాహుల్ గాంధీ వరంగల్‌కు వచ్చి రైతు డిక్లరేషన్ ప్రకటించారని, ఇవాళ ముఖ్యమంత్రి అయిన రేవంత్ రైతులను అనేక విధాలుగా మోసం చేశారని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళికలు లేవన్నారు. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ ప్రకటించిన వరంగల్‌లోనే మళ్లీ రైతులకు అండగా మే 6న వరంగల్ రైతు సభ పెట్టాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులకు ధైర్యం ఇవ్వడంతోపాటు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు. రైతుకు కావలసినవన్నీ అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది.. అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి ఏ పంటను కొనలేని దయనీయ స్థితి ఈ ప్రభుత్వానిది అని విమర్శించారు. సమావేశంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, వాణిదేవి, ఇతర నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

# ఆర్టీసియన్ల డిమాండ్లపై సానుకూలత

- **త్వరలోనే తీపి కబురు**
- **టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్**

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్ ఏప్రిల్28;**




తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ 10 రోజుల పాటు సమ్మె చేసిన విద్యుత్ ఆర్టీసియన్లకు త్వరలోనే తీపి కబురు అందనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. రాష్ట్రంలోని 20 వేలా మంది కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ ఏప్రిల్ నెలలో పది రోజులపాటు సమ్మెలో పాల్గొన్నారు. ఏ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్ సంస్థ ఉద్యోగుల పక్షనా విద్యుత్ శాఖ మంత్రిని కలిసి ఆర్టీసియన్ల పని వివరాలను వెల్లడించారు. అప్పట్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్ కండీషనల్ గా సమ్మె విరమిస్తే న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఈఎల్స్ లో రెగ్యులర్ ఉద్యోగులకు సమానంగా ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. అలాగే కారుణ్య నియామకాల విషయంలో అర్హత ఉన్న తక్కువ గ్రేడ్ ఉద్యోగం ఇచ్చేవాళ్ళు. దానిని సైతం అర్హత ఆధారంగా గ్రేడ్ లో నియామకంపై అయ్యేలా ఒక అంగీకారం కుదిరినట్టు తెలిసింది. దింతో పటు మెడికల్ విషయంలోనూ కొంత సానుకూలత వ్యక్తం చేసినట్టు తెలిసింది. వీటికి సంబంధించి ప్రభుత్వం తరపున త్వరలో తీపి కబురు ఉంటుందని స్వయంగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్ వెల్లడించారు.ఈ రోజు క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా అయన నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి సబ్ డివిజన్ కార్యాలయాన్ని తనిఖీ చేసారు. ఈ సందర్బంగా విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసియన్లకు న్యాయమైన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అలాగే ప్రభుత్వం కూడా ఆర్టీసియన్ల పట్ల సానుకూలంగా ఉందని త్వరలోనే వాళ్లకు ఆశించిన విదంగానే ఉత్తర్వులు వస్తాయన్నారు.

గ్రేడ్ ప్రమోషన్ కు సానుకూలత ?ఆర్టీసియన్ల ప్రధాన డిమాండ్ సి గ్రేడ్ ప్రమోషన్ కు సైతం ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసినట్టు తెలిసింది. శ్రమకు తగిన పలితం అన్న ఆలోచనకు అనుగుణంగా న్యాయమైన గ్రేడ్ ప్రమోషన్ కూడా ఇవ్వనున్నట్టు తెలిసింది. మొదట్లో ఆర్థిక భారం అని వద్దనుకున్నా పరిస్థితిని సమీక్షించాక స్వయంగా విద్యుత్ శాఖ మంత్రి సానుకూలత వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఏది ఏమైనా ఆర్టీసియన్లు చేసిన పోరాటానికి తగిన ఫలితం లభించడం పట్ల 20 వేల మంది కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# సింగరేణిని పదేళ్లలో దోచేశారు

**మొదటిపేజీ తరువాయి**



విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సింగరేణిని గాడిన పెడుతున్నామని, నేరుగా వేలంలో పాల్గొని కొత్త బొగ్గు గనులను దక్కించు కుంటున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడమేకాక సింగరేణిని ఏటీఎంలా వాడుకున్నారని ధ్వజమెత్తారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో డియాతో మాట్లాడిన ఆయన రూ. 60 వేల కోట్ల అప్పుగా ఉన్న తెలంగాణను రూ.8 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని వివేక్ విమర్శించారు. ఇందులో భాగంగానే రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ ఫేజ్ 2 మైన్ మంజూరైన విషయాన్ని గుర్తుచేశారు. నాడు సింగరేణికి రావాల్సిన రూ.25 వేల కోట్ల బకాయిలపై నోరు మెదపని కార్మిక సంఘాలు నేడు నెలకు రూ.10 కోట్లు ఖర్చు చేస్తూ సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. కాళేశ్వరం ఒక అట్టర్ ఫ్లాప్ ప్రాజెక్టు అని, అందులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాల్సిన బాధ్యత కేంద్రానిదేనని స్పష్టం చేశారు. గతంలో నడ్డా, అమిత్ షా వంటి వారు అవినీతి జరిగిందని ఆరోపించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

# ఫ్యూచర్ కోసమే సిటీ నిర్మాణం

**మొదటిపేజీ తరువాయి**



చెప్పారు. ఇప్పుడు నాలుగో నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. జపాన్, జర్మనీ, సింగపూర్ వంటి దేశాల్లోని అత్యాధునిక నగరాల తరహాలో భారత్‌లోనే నాలుగో నగరంగా దీన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం జరుగుతోందన్నారు. మనకున్న అద్భుతమైన ఆరఆరఆర్, ఐటీ ఎగుమతులు, కోవిడ్ వ్యాక్సిన్ తయారీలో మన ఘనతలే ఈ నగరానికి స్ఫూర్తి అని తెలిపారు. ఫ్యూచర్ సిటీ కోసం భూములిచ్చిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ఈ నగర నిర్మాణానికి సహకరించే వారు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. వచ్చే జూన్‌లో ఫ్యూచర్ సిటీ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నామని తెలిపారు. సిటీ నిర్మాణానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని.. ప్రపంచంతో పోటీపడేలా నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూన్ 2లోపు ఫ్యూచర్ సిటీ భవన నిర్మాణం జరుగుతుందన్నారు. గతంలో హైటెక్ సిటీ అంటే అవహేళన చేశారని, ఏ నగరానికీ లేని ఔటర్ రింగ్ రోడ్డు హైదరాబాద్‌కు ఉందని అన్నారు. మూడు కొవిడ్ వ్యాక్సిన్లు తెలంగాణలోనే ఉత్పత్తి అయ్యాయని గుర్తు చేశారు. యుద్ధ విమాన సర్వీస్ సెంటర్లూ హైదరాబాద్‌లో ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం ఒక నగరం కాదు.. ఇది రాబోయే తరాల తలరాతను మార్చే అద్భుత నగరం అని అన్నారు. ఫ్యూచర్ సిటీలో కలవాలనుకునే గ్రామాలు గ్రామ సభల్లో తీర్మానం చేసి ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు. తమ గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేశారని, ఆయా గ్రామాల్లో సభలు పెట్టి తీర్మానాలు చేసి కలెక్టర్, మంత్రికి పంపితే ఆయా గ్రామాలను ఫ్యూచర్ సిటీలో భాగం చేసే చర్యలు చేపడతామన్నారు. ఇక కేంద్రం దేశవ్యాప్తంగా ఏడు బులెట్ ట్రైన్లను ప్రకటిస్తే అందులో మూడు మన రాష్ట్రానికే రాబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శంషాబాద్ కేంద్రంగా ముంబై, బెంగళూరు, అమరావతి నగరాలను అనుసంధానిస్తూ బులెట్ రైళ్లు పరుగులు తీయబోతున్నాయని చెప్పారు. కేవలం రైళ్లే కాదు.. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో భారీ బస్సు టెర్మినల్‌ను కూడా మనం నిర్మించుకోబోతున్నామని రేవంత్ తెలిపారు. మెట్రో, బులెట్ ట్రైన్, అత్యాధునిక బస్ టెర్మినల్ ఇవన్నీ ఒకేచోట ఏర్పాటు కాబోతున్నాయన్నారు. త్వరలోనే రంగారెడ్డి జిల్లా ఒక మహా అద్భుతానికి సాక్ష్యం కాబోతోందని చెప్పారు. తాను కూడా ఈ గడ్డ నుండే ఊరికి వెళ్తాను.. అందుకే దీనిపై ఉన్న అభిమానంతో ఈ ప్రాంత భవిష్యత్తు కోసం అద్భుతమైన ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. ఫ్యూచర్ లేనివాడు ఫ్యూచర్ సిటీ అంటున్నాడని కొందరు అంటున్నారు... నా మీద ఏడ్చే వారికి నేను చెప్పేది ఒక్కటే.. మీరు ఏడ్చుకుంటూనే ఉండండి, నేను నా పని చేసుకుంటూనే పోతా.. ఏడుపే నా చెవులకు వినిపించే మధుర సంగీతం అని రేవంత్ అన్నారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు మహేందర్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపి వేం నరేందర్ రెడ్డి, డీజీపీ శిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీ సమస్య పరిష్కారానికి తమ మంత్రి శ్రీధర్‌బాబు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని, పేదల పట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని అధికారులకు సూచిస్తున్నానని సీఎం అన్నారు. మీరు సహకరిస్తే దేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అద్భుతమైన నగర నిర్మాణానికి వేగంగా అడుగులు పడతాయన్నారు. తాము అభివృద్ధి చేస్తామంటే కొందరు ఏడుపులు మొదలుపెట్టారంటూ మీరు ఏడుస్తూనే ఉండండి.. మేం అభివృద్ధి చేసుకుంటూ ముందుకు వెళతాం అని వ్యాఖ్యానించారు. దేవతలు యజ్ఞాలు చేస్తుంటే రాక్షసుల కుల గురువు శుక్రాచార్యుడు మారీచుడు, సుబాహుడులను పంపి భగ్నం చేయాలని ప్రయత్నించే వారు. రాష్ట్రంలో కూడా ఫామ్ హౌస్‌లో ఉన్న శుక్రాచార్యుడు మన అభివృద్ధి యజ్ఞాన్ని భగ్నం చేసేందుకు మారీచుడు, సుబాహుడిని పంపాడు.. వాళ్ల మాటలను సీరియస్‌గా తీసుకోవాల్సిన పనిలేదు అని చెప్పారు. ఈ వేదికగా మావోయిస్టులకు పిలుపునిస్తున్నా.. ఇంకా ఎవరైనా మావోయిస్టులు అడవుల్లో మిగిలిపోతే వచ్చి జనజీవన స్రవంతిలో కలవండి అన్నారు. మీ ఆరోగ్యం, మీకు భరోసా కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది అని హామీ ఇచ్చారు.


**గిరిదర్శక్‌లకు నియామక పత్రాలు**

గిరి దర్శక్ కార్యక్రమంలో భాగంగా 20మంది గిరిజన యువతకు ముఖ్యమంత్రి నియామక పత్రాలు అందించారు. పర్యాటక అభివృద్ధితో పాటు గిరిజన యువతకు జీవనోపాధి కల్పించే ఉద్దేశంతో గిరి దర్శక్ కార్యక్రమం చేపట్టామని, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లోని ప్రధాన పర్యాటక ప్రాంతాల్లో గిరిదర్శక్‌ల నియామకానికి యువతను ఎంపిక చేసి శిక్షణ అందించామని, గిరి దర్శక్‌లు పర్యాటకులకు స్థానిక సంస్కృతి, చరిత్రను వివరిస్తారని చెప్పారు. అటవీ నియమాలు పాటించేలా చూడటంతోపాటు పర్యాటకులకు భద్రత కల్పించనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, డీజీపీ శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా కొనసాగుతున్న హీట్‌వేవ్

- **పెరిగిన ఎండల తీవ్రత**
- **ఇప్పటికే వడదెబ్బకు ముగ్గురు మృతి**
- **భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం**

**హైదరాబాద్, ఏప్రిల్ 28 సిరి న్యూస్:**



తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో బయటకు రావడం కష్టంగా మారింది. తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రత కారణంగా విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. వడదెబ్బతో రాష్ట్రంలో ముగ్గురు మృతిచెందగా, పిడుగుపాటుకు ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఇక దేశవ్యాప్తంగా హీట్‌వేవ్ కొనసాగుతున్నది. ఎండలు దంచికొడుతున్నాయి. చాలాచోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి,. కొన్నిచోట్ల వరుసగా కొన్ని రోజులుగా ఎండ తీవ్రత 40 డిగ్రీలు దాటుతోంది. అయితే అదే స్థాయిలో విద్యుత్తు వినియోగం కూడా పెరిగింది. సోమవారం ఒక్క రోజే దేశవ్యాప్తంగా గరిష్టంగా 255.85 గిగావాట్ల విద్యుత్తును వినియోగించినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. ఎయిర్ కండిషనర్లు, డిజర్ట్ కూలర్లు అధికంగా వాడడం వల్ల విద్యుత్తు వినియోగం కూడా పీక్ స్టేజికి చేరుకున్నది. ఈనెలలో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఈ నెల రెండో అర్ధభాగం నుంచి విద్యుత్తు మోత మోగుతున్నది. శుక్రవారం 252.07 గిగావాట్లు, శనివారం 25వ తేదీన 256.11 గిగావాట్ల వినియోగం జరిగినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. అయితే గత ఆదివారం విద్యుత్తు వినియోగం తగ్గింది. ఆరోజు 238.15 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. కమర్షియల్, ఇండస్ట్రియల్ కంపెనీలు ఎక్కువగా సెలవు తీసుకోవడం వల్ల ఆదివారం విద్యుత్తు వినియోగం తగ్గినట్లు అంచనా. దీంతోపాటు కొన్నిచోట్ల డస్ట్ స్టార్మ్, వర్షాలు పడడం వల్ల ఆదివారం వినియోగం తగ్గింది. గత ఏడాది అత్యధికంగా విద్యుత్తు వినియోగం జూన్‌లో రికార్డు అయ్యింది. 2025 జూన్‌లో ఓ రోజు గరిష్టంగా సుమారు 242.77 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. 2024లో గరిష్టంగా 250గిగావాట్ల విద్యుత్తును మే నెలలో వాడారు. ఇక 2023లో సెప్టెంబర్‌లో సుమారు 243.27 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. ఈ ఏడాది వేసవిలో ఎండలు మండనున్నట్లు ఐఎండీ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది గరిష్ఠంగా 270 గిగావాట్ల విద్యుత్తు వినియోగం జరిగే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ నిపుణులు చెబుతున్నారు.

# డీజీపీగా సీవీ ఆనంద్

- **ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

**హైదరాబాద్, ఏప్రిల్ 28:**

తెలంగాణ కొత్త డీజీపీగా సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యూపీఎస్సీ ఎంపానెల్ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ప్రస్తుతం హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన డీజీపీగా ప్రమోషన్ పొందారు. ప్రస్తుత డీజీపీ కె.శివధర్ రెడ్డి ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. రాష్ట్రంలోని సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్ల జాబితాను ఇటీవల యూపీఎస్సీ ప్యానెల్‌కు రాష్ట్ర ప్రభుత్వం పంపింది. ఆ జాబితాలో 1991 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి ఆనంద్‌తోపాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యా మిశ్రా ఉన్నారు. వారిలో సీనియర్ అయిన సీవీ ఆనంద్‌ను రాష్ట్ర ప్రభుత్వం కొత్త డీజీపీగా ఎంపిక చేసింది.

# పర్యాటక ప్రభ పెంచుదాం

**మొదటిపేజీ తరువాయి**



కల్పన, గమ్యస్థానాల బ్రాండింగ్, విస్తృత ప్రచార కార్యక్రమాలకు సంబంధించి నిర్దిష్ట కాలపరిమితితో కూడిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. బేగంపేటలోని టూరిజం ప్లాజాలో మంగళవారం నిర్వహించిన పర్యాటక సలహా కమిటీ/మండలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని వారసత్వ సంపద, సంస్కృతి, అద్భుతమైన కట్టడాలు, ప్రకృతి రమణీయ ప్రదేశాలు, జల వనరులు, దట్టమైన అడవులు, ఆధ్యాత్మిక కేంద్రాలను సమన్వయం చేస్తూ తెలంగాణను ఒక శక్తివంతమైన పర్యాటక హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు కనీస సౌకర్యాల కల్పనలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వెల్లడైన ప్రతిపాదనలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని, అమలు ప్రక్రియలో జాప్యం జరగకుండా నిర్దిష్ట పని లేదా ప్రాజెక్టు బాధ్యతను పర్యవేక్షించడానికి నోడల్ అధికారికి అప్పగించాలని సూచించారు. దేశీ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు నవంబరు లేదా డిసెంబరులో హైదరాబాద్‌లో భారీస్థాయిలో కార్నివాల్ నిర్వహణకు అధ్యయనం చేయాలని, సాధ్యమైనంత త్వరగా పత్రిపాదనలు రూపొందించి సమర్పించాలని చెప్పారు. ప్రారంభంలో ప్రభుత్వమే చేపట్టినా భవిష్యత్తులో ప్రైవేటు భాగస్వామ్యంతో స్వయంసమృద్ధిగా సాగేలా చూడాలన్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ సమన్వయంతో నగర సుందరీకరణలో భాగంగా శిల్పాలు, ఆకర్షణీయమైన ల్యాండ్‌స్కేపింగ్, స్కైవాక్‌లను సృజనాత్మక ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని సూచించారు. రాష్ట్రంలోని సోమశిల, వరంగల్, రామప్ప, యాదాద్రి, గోల్కొండ, తారామతి బరాదరి, నాగార్జునసాగర్ వంటి కీలక పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రధాన పర్యాటక కేంద్రాల్లో క్రమం తప్పకుండా వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు, వనరులు ఉన్నప్పటికీ ప్రచారంలో వెనుకబడి ఉన్నామని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం, కారవాన్ కోసం ఇప్పటికే ప్రతిపాదనలు ఆహ్వానించామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న హరిత హోటళ్ల నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకోవాలని, వారసత్వ కట్టడాల నిర్వహణ కోసం 'ఆగాఖాన్' మోడల్‌లో ట్రస్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడంతోపాటు మెడికల్, వెల్నెస్, గోల్ఫ్, ఫిలిం, ఎకో టూరిజం కేంద్రంగా ప్రచారం చేయాలని కమిటీ సభ్యులు సమావేశంలో ప్రతిపాదించారు. ముఖ్యంగా మధ్యప్రాచ్యం, సెంట్రల్ ఆసియా మార్కెట్లలో విస్తృత మార్కెటింగ్ కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ సభ్యులు నొక్కి చెప్పారు. పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించేలా ఇన్వెస్టర్ అవుట్ రీచ్ కార్యక్రమాలు చేపట్టాలని, ప్రాజెక్టుల అమలులో వేగం పెంచాలని సూచించారు. పర్యాటక ప్రదేశాలను అద్భుత కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చైనా, వియత్నాం వంటి దేశాల్లో అధ్యయన పర్యటనలు చేపట్టాలని, జైపూర్ సిటీతో పోటీ పడేలా హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలను వెడ్డింగ్ డెస్టినేషన్స్‌గా తీర్చిదిద్దడం, కేరళ తరహాలో ప్రకృతి ఉత్పత్తులు, సంస్కృతిని ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రూపొందించడం, ఈత, తాటి కల్లు, ఇతర ఉప ఉత్పత్తులను ప్రోత్సహిస్తూనే బ్రాండింగ్ చేయడం, వారసత్వ విధానం ఉండాలని సూచించారు. విదేశీయుల కంటే భారతీయులే పర్యాటకానికి ఎక్కువ ఖర్చు చేస్తారు, కాబట్టి స్వదేశీ పర్యాటకంపై దృష్టిపెట్టి తెలంగాణ పర్యాటక ప్రమోషన్, బ్రాండింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి ప్రచారానికి నిధులు కేటాయించాలన్నారు. మధ్యప్రాచ్యం (మిడిల్ ఈస్ట్) నుండి పర్యాటకులను ఆకర్షించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని ప్రతిపాదించారు. వరంగల్, సోమశిల వంటి ప్రాంతాల్లో ప్రైవేట్ భాగస్వామ్యంతో 3 నుండి 5 స్టార్ హోటళ్లను నిర్మించడం, బమ్మెరలో పోతన స్మృతి వనం నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, వరంగల్ హరిత హోటల్ నుంచి రామప్ప వరకు బస్సు సర్వీసులు నడపాలని సభ్యులు సూచించారు. సమావేశంలో పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ గౌతమి, డైరెక్టర్ ఆఫ్ టూరింజం లక్ష్మణ్ రంజిత్ నాయక్, కమిటీ సభ్యులు పాపారావు, కమలవర్ధన్ రావు, డాక్టర్ బాలాజీ, జుల్ఫీ, మార్గ్ పటేల్, రాందేవ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల ఉల్లంఘన

- కాలపరిమితి ముగిసినా కొత్త సంస్థకు డేటా బదిలీ చేయక అడ్డంకులు
- ట్రాన్సాక్షన్ అనలిస్ట్స్ పై సీసీఎస్‌లో కేసు, దర్యాప్తు వేగవంతం

**హైదరాబాద్, ఏప్రిల్ 28 సిరి న్యూస్:**

నమ్మక ద్రోహం, డిజిటల్ ఆస్తుల దుర్వినియోగం, ప్రాజెక్టు అప్పగింతకు అడ్డంకులు సృష్టించినందుకు ట్రాన్సాక్షన్ అనలిస్ట్స్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌తోపాటు దాని ఎండీ, సీఈవో శ్రీనివాసరావు కాటూరిపై ప్రభుత్వం కేసు నమోదు చేసింది. దీనికి సంబంధించి ఐటీ అండ్ కమ్యూనికేషన్స్ శాఖలో ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్‌డీ) విభాగం ట్రాన్సాక్షన్ అనలిస్ట్స్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌పై సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో కేసు పెట్టింది. ఎకనామిక్స్ అఫెన్స్ వింగ్‌కు చెందిన ఏసీపీ ఎ.రామ్‌రెడ్డి ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసు ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగం, చట్టబద్ధ ప్రాజెక్టు హ్యాండోవర్‌ను ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం వంటి తీవ్ర ఆరోపణలపై నమోదు చేశారు. ట్రాన్సాక్షన్ అనలిస్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను 2017 జనవరిలో జారీ చేసిన వర్క్ ఆర్డర్ ద్వారా రాష్ట్రానికి చెందిన డిజిటల్ ప్లాట్‌ఫామ్ అభివృద్ధి, నిర్వహణ కోసం నియమించారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సుమారు రూ.70 లక్షలు అభివృద్ధి, అమలు ఖర్చులుగా చెల్లించడంతోపాటు అమల్లోకి వచ్చిన తర్వాత ప్రతినెలా నిర్వహణ చార్జీలు కూడా చెల్లించింది. ఒప్పంద నిబంధనల ప్రకారం కాలపరిమితి ముగిసిన తరువాత ప్రాజెక్టుకు సంబంధించిన మొత్తం డేటా, సోర్స్ కోడ్‌తోపాటు డిజిటల్ ఆస్తులపై పూర్తి హక్కులు ప్రభుత్వానికి చెందాలి. అయితే మూడుసార్లు (2018 నుంచి 25 వరకు) అవే నిబంధనలతో పొడగింపు పొందిన ఈ సంస్థ కాలపరిమితి మే 31, 2025తో ముగిసింది. కొత్త సంస్థ ఎంపిక కోసం పారదర్శక టెండర్ ప్రక్రియను ప్రభుత్వం పిలిచింది. దీనిలో పర్వ్యా ఇండియా కన్సల్టింగ్ అండ్ సర్వీసెస్ కంపెనీ ఎల్ 1గా ఎంపికైంది. ట్రాన్సాక్షన్ అనలిస్ట్స్ సంస్థ కూడా ఈ టెండర్‌లో పాల్గొని నిబంధనలను అంగీకరించింది. అయితే టెండర్‌లో విఫలమైన తర్వాత సంస్థ తన వైఖరిని మార్చుకుని సహకరించకుండా వ్యవహరిస్తోంది. తప్పుడు యాజమాన్య పత్రాలతో ప్రభుత్వానికి చెందిన డేటాను తమదిగా చెప్పే ప్రయత్నం చేసింది. కొత్త సంస్థకు హ్యాండోవర్ ప్రక్రియను ప్రారంభించినప్పటికీ పదేపదే ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించింది. అలాగే నిధుల దుర్వినియోగంతోపాటు, యూజర్ డేటాను తమ ప్రైవేట్ అప్లికేషన్‌కు మళ్లించే ప్రయత్నం చేసింది. టెండర్ నిబంధనల ప్రకారం కొత్త సంస్థకు డేటా అందిస్తామని ముందుగా ఒప్పుకున్నా ఆ హామీని నిలబెట్టుకోలేదు. వీటిపై ప్రభుత్వం తీవ్రంగా స్పందిస్తూ ప్రజా ఆస్తులను రక్షించేందుకు, చట్టపరమైన చర్యలను పూర్తిస్థాయిలో అమలు చేయడానికి సీసీఎస్‌లో కేసు నమోదు చేసింది. కేసు దర్యాప్తులో భాగంగా ట్రాన్సాక్షన్స్ సంస్థకు చెందిన ప్రస్తుత, మాజీ ఉద్యోగులందరికీ చట్టపరమైన నోటీసులు జారీ చేశారు. సంస్థలో చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసులును మే 25న పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది. ఇతర నిందితులైన సంస్థ ఎండీ, సీఈవో శ్రీనివాసరావు కాటూరి, ప్రాజెక్టు మేనేజర్ కిరణ్ కుమార్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని సమాచారం. వారిని కూడా పట్టుకునేందుకు పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. ఈ విషయాన్ని ఐటీ శాఖ ప్రభుత్వానికి నివేదించగా ఒప్పంద నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడం, భవిష్యత్ టెండర్ల నుంచి బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం, నష్టపరిహారం వసూలు చేయడం వంటి చర్యలు ట్రాన్సాక్షన్స్ సంస్థపై పరిశీలనలో ఉన్నాయి.



### నేడే పదవ తరగతి

# పరీక్షల ఫలితాలు!

**మొదటిపేజీ తరువాయి**

విడుదలకు ముహూర్తం దాదాపు ఖరారైంది. రేపు బుధవారం మధ్యాహ్నం ఈ ఫలితాలను వెల్లడించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 14న ప్రారంభమైన పదో తరగతి ప్రధాన పరీక్షలు.. ఈ నెల 13వ తేదీతో విజయవంతంగా ముగిశాయి.

సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు.పరీక్షలు ముగిసిన వెంటనే విద్యా శాఖ యుద్ధప్రాతిపదికన మూల్యాంకన ప్రక్రియను చేపట్టింది. ఈ నెల 23వ తేదీ నాటికే జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి కావడంతో.. ఫలితాలను అనుకున్న సమయం కంటే ముందే విడుదల చేయాలని అధి కారులు నిర్ణయించారు.

వాస్తవానికి మే మొదటి వారంలో ఫలితాలు విడుదల చేయాలని భావించినప్పటికీ, విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందు కు, పై చదువుల ప్రవేశాల కు వీలుగా ఈ నెల 29నే ఫలితాలను విడుదల చేసేందుకు రంగం సిద్ధ మైంది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుండి కూడా సానుకూల స్పందన లభించినట్లు సమాచారం. ఈ ఏడాది ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వ సలహాదా రు కె.కేశవరావు అధికారికంగా విడుదల చేయను న్నారు. ఇప్పటికే మార్కుల నమోదు, సాంకేతిక తనిఖీ లు పూర్తి కావచ్చాయని, విద్యార్థులు తమ ఫలితా లను అధికారిక వెబ్‌సైట్లలో చూసుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని విద్యాశాఖ తెలిపింది.

# డ్రగ్స్ కేసులో రోహిత్ రెడ్డికి బెయిల్

- రేపు జైలు నుంచి విడుదలయ్యే అవకాశం

**హైదరాబాద్, ఏప్రిల్ 28 సిరి న్యూస్:**



మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత మార్చి 14న రాత్రి రోహిత్‌ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో మొత్తం ముగ్గురిని అరెస్టు చేశారు. వారిలో పైలట్ రోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, వ్యాపారవేత్త నమిత్ శర్మ ఉన్నారు. రోహిత్ రెడ్డి తరఫున మాత్రమే న్యాయవాదులు హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ మంజూరు కావడంతో బుధవారం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మార్చి 14న మొయినాబాద్ ఫాంహౌస్‌లో దాడులు చేసిన పోలీసులు కొకైన్, లిక్కర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పార్టీలో పాల్గొన్న 11మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా వారిలో ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలింది. ఈ కేసులో రోహిత్ రెడ్డి నెలకుపైగా చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ఏపీ¾కి చెందిన ఓ ఎంపీ కూడా దొరికినా స్టేషన్ బెయిల్‌తో బయటకు వచ్చారు.

# లంచం కోసం టేకో లాక్..!

**మొదటిపేజీ తరువాయి**

సమస్యకు పరిష్కారం దొరకదు. సంగారెడ్డి జిల్లాలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో జరుగుతున్న ఈ అవినీతి మూలంగా ఇంజనీర్ అధికారులు ఇబ్బందులపాలవుతున్నారు. సంగారెడ్డి విద్యుత్ సర్కిల్ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక పారిశ్రామిక వాడ కలిగిన ప్రదేశం ఇందుకుతోడు వాణిజ్యం వ్యవసాయం కోసం ఈ సర్కిల్ పరిధిలో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరుగుతూ ఉంటాయి. ఆలా జరుగుతున్న పనుల్లో మొదటగా వాటికీ అంచనాలు మంజూరు ఉంటుంది ఆపై పనిచేయడానికి సామాగ్రి రావాలంటే వర్క్ ఆర్డర్ ఇస్తారు. ఇలా దాదాపు 100 కోట్ల పైచిలుకు పనులకు గత రెండేళ్లలో మంజూరీలు వచ్చాయి. ఇందులో సివిల్, ట్రాన్సఫార్మర్ల మరమ్మతు, కొత్త లైన్లు,విరిగిన స్తంబాలు మార్చడం, వాహనాల ఏర్పాటు, స్టేషనరీ ,నూతన ట్రాన్సఫార్మర్లు లేదా సుబ్స్టేషన్ల ఏర్పాటు తో పాటు పలురకాల పనులు ఉంటాయి. అ పనులు వర్క్ ఆర్డర్ తీసుకున్నాక క్షేత్ర స్థాయిలో పనులు చేయడానికి జిల్లా స్టోర్ నుండి సామగ్రి తీసుకువెళ్లాలి. ఆలా స్టోర్లలో సంపూర్ణగా కావాల్సిన సామాగ్రి ఎప్పుడు ఉండదు. దింతో ఉన్న సామగ్రిని తీసుకెళ్లి సదరు సెక్షన్ ఏఈ లు కాంట్రాక్టర్లతో పనిచేయిస్తుంటారు.ఆలా పనిచేసాక సదరు కాంట్రాక్టర్లు బిల్లులు పెట్టుకునే సమయంలో ఆ సామగ్రి డ్రా చేద్దామంటే అప్పటికే అది టేకో మోడ్ లోకి వెళ్తుంది.

**కథ మొదలయ్యేది అపుడే..**

ఒక్కసారి వర్క్ఆర్డర్ టేకో మోడ్ కి వెళ్తే చాలు సర్కిల్ కార్యాలయంలో ఉన్న ఏఏఓ దగ్గరికి వెళ్లాల్సిందే. ఎందుకంటే టేకో మోడ్ లో వర్క్ ఆర్డర్ ఉంటె డ్రా చేయని సామాగ్రి డ్రా చేయడం సాధ్యం కాదు అలాగే చేసిన పనికి బిల్లుల చెల్లింపు జరగదు.

**టెక్ మోడ్ తో ఆ అధికారి చేతివాటం**

సంగారెడ్డి సర్కిల్ కార్యాలయంలో పనులు చేసాక బిల్లుల మంజూరి కోసం ఎల్ఒసి ఆయా డివిషన్ల ద్వారా ఇక్కడకు చేరాల్సిందే. ఆ చెల్లింపులు ఎల్ఒసి కేంద్ర కార్యాలయానికి పంపాలంటే అయన ఆమోదం పొందాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో టేకో మోడ్ నుండి వర్క్ ఆర్డర్ తీసేయాలంటే 5 శాతం పర్సెంటేజ్ (లంచం) ఇచ్చే విదంగా ఇక్కడ అనధికార చట్టం కొనసాగుతుంది. గత రెండేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్న అయన ఇప్పటికే కోట్లాది రూపాయల వర్క్ ఆర్డర్ లను టేకో మోడ్ నుండి సాధారణ మోడ్ కు తేవడానికి కృషిచేసినట్టు విద్యుత్ శాఖలో అధికారులు చెబుతుంటారు. ఇలా ఇప్పటివరకు 50 కోట్ల రూపాయల పైచిలుకు బిల్లులు సదరు అధికారి ఆధ్వర్యంలోనే జరిగాయంటే ఈ మేర అవినీతి జరిగి ఉంటుందో అర్ధం చేసుకోవచ్చు. ఒక్కసారి టేకో మోడ్ కు వచ్చాక సదరు అధికారి కోర్ టీం కు టేకో తీసివేయాలని స్వయంగా మెయిల్ పెట్టడమో లేదా సంబంధిత డివిజన్ నుండి జెఏఓ ల ద్వారా పెట్టించి స్వయంగా అక్కడివాళ్ళతో మాట్లాడి సమస్య పరిష్కారం చేసేవాడట!

**అధికారులకు తప్పని తిప్పలు**

ఎన్నడూ లేని విదంగా టేకో మోడ్ కోసం కొత్తగా సర్కిల్ ఏఏఓ చేస్తున్న అదనపు లెక్కలను ఇవ్వలేక ఇవ్వకపోతే వర్క్ ఆర్డర్లు క్లోజ్ కాక ఇంజనీర్ అధికారులు నానా తిప్పలు పడుతున్నారు.ఇందుకు కారణం ఎవరైనా సెక్షన్ ఏఈ కి ఎక్కువగా వర్క్ ఆర్డర్ పెండింగ్ కనపడితే ఉన్నతాధికారులనుండి శాఖ పరమైన చర్యలు ఉంటాయి. ఆలా అని స్టోర్ లో ఎప్పుడు మంజూరైన సామగ్రిలో చాల వరకు స్టాక్ ఉండదు. దింతో ఏదోలా వర్క్ ఆర్డర్ క్లోజ్ చేసుకోవడానికి సదరు అధికారి వేసిన టేకో మోడ్ వలలో సెక్షన్ అధికారులు చిక్కుకుంటున్నారు.

**స్టోర్ స్టాక్ పరిస్థితి తెలిసి..**



జిల్లా కేంద్రంలో ఉన్న మెటీరియల్స్ స్టోర్ లో సంగారెడ్డి సర్కిల్ పరిధిలో ఉన్న డివిజన్ పనులకు సామగ్రి పంపిణి చేస్తుంటారు. కరోనా తర్వాత స్టోర్ లో అన్ని సామగ్రి ఒకేసారి తీసుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఒక్కోసారి సామాగ్రి మొత్తం రావాలంటే ఏడాది స్టోర్ కు తిరగాల్సిందే. ఇది ఆసరాగా తీస్కొని సర్కిల్ మొత్తం వర్క్ ఆర్డర్ పరిస్థితిని పర్యవేక్షించే ఆ అధికారే అదనపు లాభం కోసం టేకో మోడ్ ను ఎంచుకున్నాడన్న ఆరోపణలు ఉన్నాయ్.

**నేనొక్కడినే తీసుకుంటున్నానా !**

టేకో మోడ్ పేరుతో అదనంగా వసూలు చేయడంపై అటు సెక్షన్ అధికారులు ఇబ్బంది పడుతున్నారని సదరు ఏఏఓ కు ఆయనతో సన్నిహితంగా ఉండే ఒక అధికారి చెప్పాడట. దీనికి అయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ అందరికోసం వసూలు చేస్తున్నాం నేనొక్కడినే తింటున్నానా అంటూ సదరు అధికారిపై మండిపడ్డాడట. అది విని ఆ అధికారి అక్కడినుండి మెల్లిగా జారుకున్నట్టు ఆ శాఖ లో పెద్ద చర్చ !

**బిల్లులకు అదనం**

ఆయా డివిజన్లలో చేసే పనుల బిల్లులకు రెండు శాతం తప్పని సరి పర్సెంటేజ్ ఇవ్వాల్సిందే. ఇందుకోసం సంబంధిత డివిజన్లలో బిల్లు పంపే అధికారులే వసూలు చేసి పంపుతారట లేదంటే బిల్లులు ముందుకు పోవన్నది ఆ శాఖ అధికారులే చెబుతుంటారు.ఇలా ఎలా అవకాశం దొరికితే ఆలా ముక్కుపిండి వసూలు చేస్తున్న సదరు అధికారి మూలంగా విద్యుత్ శాఖకే చెడ్డపేరు వస్తుందని ఆ శాఖ అధికారులే వాపోతున్నారు. మాములుగా పని బిల్లుకు కాంట్రాక్టర్ ల వద్దనుండి వాసులు చేస్తే సర్ ఏకంగా తన శాఖలో పనిచేసే ఇంజినీర్ల వద్ద వాసులు చేయడం పట్ల ఆ శాఖ అధికారులనుండే నిరసన వ్యక్తం అవుతుంది.

**సీఎండీ సర్ చర్యలు తీసుకోండి**

సంగారెడ్డి విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై చర్యలు తీసుకోవాలని, మరింత లోతుగా విచారణ చేస్తే ఇంకెన్నో అవినీతి కథలు బయటపడే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులే చర్చించుకుంటున్నారు.

# పెట్రోల్, డీజిల్ సరఫరా పెంచిన సివిల్ సప్లైస్

- 126 శాతం మేర రవాణా
- బంకుల్లో రద్దీ నివారణకు వేగవంతమైన చర్యలు

**హైదరాబాద్, ఏప్రిల్ 28 సిరి న్యూస్:**

ప్రజలకు ఇబ్బంది లేకుండా పెట్రోల్, డీజిల్ అందేలా చూడటానికి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆదివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా చమురు సరఫరాను 126% పెంచింది. అకస్మాత్తుగా పెరిగిన డిమాండ్ వల్ల పెట్రోల్ బంకుల్లో తలెత్తిన రద్దీని తగ్గించడానికి అధికారులు ఈ వేగవంతమైన నిర్ణయం తీసుకున్నారు. పెట్రోల్ బంకుల దగ్గర ఇలా ఊహించని రద్దీ పెరగడానికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయి. మొదటిది.. పరిశ్రమలకు వాడే డీజిల్ ధరను ఇటీవల లీటరుకు రూ.150కు పెంచారు. దీంతో పెద్ద మొత్తంలో కొనే వ్యాపారులు లీటరు రూ.95కే దొరుకుతున్న సాధారణ పబ్లిక్ పెట్రోల్ బంకులకు వచ్చి డీజిల్ కొంటున్నారు. రెండవది.. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో సరఫరా సమస్యలు ఉన్నాయి. దీనివల్ల పక్క రాష్ట్రాల ప్రజలు పెట్రోల్, డీజిల్ కోసం ఖమ్మం, నిర్మల్ వంటి తెలంగాణ సరిహద్దు జిల్లాలకు క్యూ కడుతున్నారు. మూడవది.. ఎన్నికల తర్వాత ధరలు పెరుగుతాయనే వదంతుల వల్ల సాధారణ ప్రజలు భయపడి అవసరానికి మించి కొని దాచుకుంటున్నారు. దీంతో స్థానికంగా ఉన్న నిల్వలు వేగంగా అయిపోతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి పెట్రోల్, డీజిల్ కంపెనీలకు మార్కెట్‌లో సరిపడ నిల్వలు ఉంచాలని పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర అత్యవసర ఆదేశాలు జారీ చేశారు. సరఫరాను వేగవంతం చేయడానికి, డీలర్ల నుంచి ముందుగానే ఆర్డర్లు తీసుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా 3,100 ఇంధన (ట్యాంకర్ల) వాహనాలను రంగంలోకి దించారు. పెట్రోల్ బంకుల్లో నిల్వలు అయిపోకముందే వాటికి ఇంధనం చేరేలా అధికారులు పర్యవేక్షణ పెంచారు. ప్రతి మూడు గంటలకోసారి బంకుల నుంచి నిల్వల వివరాలు తెప్పించుకోవడంతోపాటు రోజూ టెలికాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ముఖ్యంగా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పెట్రోల్, డీజిల్ అందేలా చూడాలని కఠిన ఆదేశాలు ఇచ్చారు. దీనివల్ల పంట కోతలు, ధాన్యం కొనుగోళ్లకు ఎలాంటి ఆటంకం కలగదు. ఇంత భారీగా సరఫరా పెంచడం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా రోజువారీ డీజిల్ పంపిణీ 151% అంటే 7,348 కిలో లీటర్ల నుంచి 18,449 కిలో లీటర్లకు పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ పంపిణీ కూడా దాదాపు రెట్టింపు అయ్యింది. ఇది 95% పెరిగి 5,883 కిలో లీటర్ల నుంచి 11,490 కిలో లీటర్లకు చేరుకుంది. రాజధాని ప్రాంతంలో ఎలాంటి కొరత రాకుండా చూసేందుకు హైదరాబాద్‌లో ఇంధన సరఫరాను 43% మేర పెంచారు. నగరంలో డీజిల్ నిల్వలను 46% (3,393 నుంచి 4,957 కిలో లీటర్లకు), పెట్రోల్ నిల్వలను 40% (3,908 నుంచి 5,466 కిలో లీటర్లకు) పెంచారు. తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరత ఏమాత్రం లేదని పౌర సరఫరాల శాఖ ప్రజలకు హామీ ఇస్తోంది. ప్రజలు ఎలాంటి పుకార్లను నమ్మవద్దని, ఎప్పటిలాగే తమకు అవసరమైన మేరకే పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని అధికారులు కోరుతున్నారు. ప్రజల, రైతుల అవసరాలకు సరిపడా నిల్వలు పెట్రోల్ బంకుల్లో ఎప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు.

# సమ్మర్ క్యాంప్‌లతో సృజనాత్మకత వెలికితీత

- బడి చదువులకు భిన్నంగా విజ్ఞానం, వినోదం
- అనేక కార్యకలాపాలకు సిద్ధమవుతున్న పాఠశాలలు
- మహాబోధి విద్యాలయలోనూ ఎన్నో కార్యక్రమాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 28 సిరి న్యూస్ :**

వేసవి సెలవులు వచ్చేసాయి, ఏడాదిపాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన పిల్లలు ఉపశమనం కోసం ఆటపాటలకు సిద్ధమవుతున్నారు. ఉదయాన్నే యోగ, శారీరక వ్యాయామం క్రికెట్, షటిల్, టేబుల్ టెన్నిస్, టైక్వాండో, జూడో, కరాటే, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ ఆటలకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. చెస్, క్యారమ్స్, లూడో తదితర ఇండోర్ గేమ్స్, చిత్రలేఖనం, అందమైన చేతిరాత, స్టోరీ టెల్లింగ్ తదితర యాక్టివిటీకి చాలా పాఠశాలలు సన్నద్ధమవుతున్నాయి. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేందుకు వేసవి శిబిరాలను(సమ్మర్ క్యాంప్) రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాలని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల గద్దర్ భావించారు. బడి చదువులకు భిన్నంగా వేసవి సెలవుల్లో వినోదంతో కూడిన విజ్ఞానాన్ని అందించేందుకు వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నామని మహాబోధి విద్యాలయ సంస్థ నిర్వాహకురాలు తెలిపారు. పిల్లలు తమ బాల్యాన్ని కోల్పోకుండా ఒత్తిడి లేని విద్యను అందించడమే పాఠశాలల ప్రథమ కర్తవ్యం. కథలు చెప్పడం, కథలు రాయించడం వల్ల పిల్లల్లో ఊహా శక్తి పెరుగుతుంది, ప్రయోగాలు నేర్పించడం ద్వారా సైన్స్‌ను అర్థం చేసుకోవడం సులభతరం అవుతుంది. ఈ కార్యశాలలో కాల్పనిక సాహిత్యంపై పిల్లలు సాహిత్యం చదవడం వల్ల వారిలో రాసే శక్తి వస్తుంది. దేశంలో పిల్లల సాహిత్యంపై ప్రచురితమవుతున్న పుస్తకాలు పరిచయం చేయడం వల్ల వివిధ ప్రాంతాల మాండలికాలు, అలవాట్లు, అభిరుచి, వేషధారణ పిల్లలకు తొందరగా అర్థమవుతుంది. పిల్లలు ఏ రకమైన వేసవి శిబిరానికి వెళ్ళినా అది ఆత్మవిశ్వాసం, స్వాతంత్ర్యం వంటి సానుకూల లక్షణాలు పెంపొందిస్తాయి. శిబిరంలో పిల్లలు కొత్త విషయాలు తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారు. కొత్త ఆసక్తులను కనుగొంటారు. కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటారు. వేసవి శిబిరాలు పిల్లలలో ఆందోళన భావనలను కూడా తగ్గించగలవు. వేసవి శిబిరాలలోని సామాజిక అంశం కూడా చాలా కుటుంబాలను బాగా ఆకర్షిస్తుంది. పిల్లలు తోటి శిబిరవాసులతో కలిసి కార్యకలాపాలలో పాల్గొంటున్నప్పుడు వారు కొత్త స్నేహితులను సంపాదించుకోవడం తోపాటు, ఒక జట్టుగా కలిసి పనిచేయడాన్ని కూడా అలవాటు చేసుకుంటారు.

**రెసిడెంట్ క్యాంప్**

కళాకారులు యువతీయువకులకు అయితే రెసిడెంట్ క్యాంపు నిర్వహించి శిక్షణ పొందేవారు, తోటి సిబ్బంది, కౌన్సిలర్లు ఒకే ప్రాంగణంలో నివసిస్తే అనేక రకాల కార్యకలాపాలలో పాల్గొనవచ్చు. కొన్ని రెసిడెంట్ క్యాంపులు నిర్దిష్ట ఆసక్తి గల రంగాలలో ప్రత్యేకతను కలిగి ఉంటే మరికొన్ని విస్తృతమైన అంశాలపై దృష్టి పెడతాయి. సాధారణంగా డే క్యాంపులలో, పిల్లలు పగటిపూట కొన్ని గంటల పాటు శిబిరానికి హాజరై ఇంటికి వెళ్లి మళ్ళీ సాయంత్రం క్యాంపునకు వచ్చి చీకటి పడే వరకు ఉంటారు. డే క్యాంపులు తరచుగా ఒక నిర్దిష్ట ఇతివృత్తం లేదా ఆసక్తి ఉన్న రంగం చుట్టూ కేంద్రీకృతమై ఉంటాయి. లలిత కళల శిబిరాలు పిల్లల్లోని వర్ధమాన కళాకారుడిని వెలికి తీస్తాయి. అది కళ, నృత్యం, సంగీతం, నాటకం లేదా ఫోటోగ్రఫీ అయినా సరే.. పిల్లలు తమ నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడంలో సహాయపడటంపై దృష్టి సారించే అనేక వేసవి శిబిర కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయి.


**విద్యా శిబిరాలు**

విద్యాపరమైన అంశాలపై దృష్టి సారించే వేసవి శిబిరాలు చాలా ఉన్నాయి. విద్యార్థి పాఠశాల సంవత్సరంలో నేర్చుకున్న భావనలను మరింత పటిష్టం చేస్తాయి. అంతేకాక వారికి ఆసక్తి ఉన్న అంశాలు, విషయాలపై లోతైన అవగాహనను కూడా అందిస్తాయి. కోడింగ్, గణితం, ఇంజనీరింగ్ వంటి అనేక విభిన్న సబ్జెక్టులకు అనుగుణంగా విద్యా శిబిరాలు రూపొందాయి. పిల్లలకు మానవీయ శాస్త్రాలపై ఎక్కువ ఆసక్తి ఉంటే రచన, చరిత్ర లేదా భాషా పరిజ్ఞానంపై దృష్టి సారించే శిబిరాల కోసం దృష్టిపెట్టాలి. అలాగే శాస్త్ర సాంకేతిక అంశాలు బోధించే సైన్స్ ప్రయోగాలు, పజిల్స్, ప్రాజెక్టు చేయగలిగే అరవింద్‌గుప్తా టాయ్స్, లో కాస్ట్ నో కాస్ట్ యాక్టివిటీ పట్ల పిల్లలకు తర్ఫీదు ఇవ్వాలి. భవిష్యత్తులో జరిగే సైన్స్ ఫెయిర్, ఎగ్జిబిషన్లలో పాల్గొనడానికి, సైన్స్ అవార్డులు సాధించడానికి ఆసక్తి చూపుతారు. శాస్త్ర సాంకేతిక, క్రీడా రంగంలో రాణించిన వారిని పరిచయం చేస్తే గొప్పగా ప్రేరణ పొందుతారు.

**ఆరోగ్యం, ఆహారం శిబిరాలు**

పిల్లలకు మంచి ఆరోగ్య, ఆహార అలవాట్లు పెంపొందించేందుకు ఎలాంటి ఆహారం తీసుకోవాలి ఎంత మోతాదులో తినాలి, ఎప్పుడు తినాలి, ఎందుకు తినాలి, నీళ్లు ఎందుకు తాగాలి, ఎన్ని తాగాలి, ఎప్పుడు తాగాలి అనే అంశాలు శిబిరాలలో బోధిస్తే మంచి ఆరోగ్య అలవాట్లు పెంపొందించిన వారవు తారు. చేతి గోర్లు పొట్టిగా కత్తిరించుకోవడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, కాలకృత్యాలు తీర్చుకున్న తర్వాత చేతులు కడుక్కోవడం వంటివి నేర్పించాలి. శారీరక వైకల్యాలు, అనారోగ్య సమస్యలు లేదా మానసిక ఆరోగ్య సవాళ్లు ఉన్న పిల్లలకు ఒక గొప్ప అనుభవాన్ని అందించడంపై దృష్టి సారించే వివిధ రకాల వేసవి శిబిరాలు అందుబాటులోకి రావాలి.





# నిబంధనలు చెప్పేవారే నీటిని వృథా చేస్తున్నారు..!





- జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం బహిర్గతం
- పటాన్‌చెరు సర్కిల్ కార్యాలయం వద్ద నీటి దుర్వినియోగం
- అధికారుల వైఖరిపై ప్రజల ఆగ్రహం

**రామచంద్రపురం, ఏప్రిల్ 28, (సిరి న్యూస్):**

వేసవి తీవ్రతతో భూగర్భ జలాలు అడుగంటుతున్న వేళ, ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్న సమయంలో, ప్రభుత్వ కార్యాలయం పరిధిలోనే నీటి దుర్వినియోగం చోటుచేసుకోవడం విమర్శలకు దారితీస్తోంది. పటాన్‌చెరు జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయ ఆవరణలో సిబ్బంది నిర్లక్ష్యంగా నీటిని రోడ్డుపైకి వదులుతున్న ఘటన బయట పడింది.కార్యాలయ పరిసరాల శుభ్రత పేరుతో పైపుల ద్వారా పెద్ద ఎత్తున నీటిని నేరుగా రహదారిపైకి విడుదల చేస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. దీనివల్ల ఒకవైపు నీరు వృథా అవుతుండగా, మరోవైపు వాహనదారులు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు.ఇప్పటికే నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి కొరత నెలకొన్న నేపథ్యంలో, ఇలా వేల లీటర్ల నీటిని వృథా చేయడంపై పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు నీటిని పొదుపుగా వినియోగించాలంటూ సూచనలు చేసే అధికారులు, తమ పరిధిలో జరుగుతున్న ఈ వ్యవహారాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారుల సమక్షంలోనే ఇలాంటి ఘటనలు జరగడం శోచనీ యమని, ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.నీటి సంరక్షణపై అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లోనే ఇలాంటి పరిస్థితులు కనిపించడం పట్ల అసంతృప్తి

# నిధుల విడుదల గురించి కలెక్టర్ ను కలిసి వినతి పత్రం ఇచ్చిన సర్పంచుల

**రామాయంపేట, (నిజాంపేట)ఏప్రిల్ 28(సిరి న్యూస్)**

నిజాంపేట మండలానికి చెందిన 13 మంది సర్పంచులు మంగళవారం నాడు జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం డిపిఓ ను కూడా కలిసి 15th Finance నిధుల విడుదల గురించి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. గ్రామ పంచాయతీకి సంబంధించిన PFMS అకౌంట్లో కేంద్ర ప్రభుత్వం నిధులు జమ చేసినప్పటికీ దానిని గ్రామ మౌలిక సదుపాయాల కొరకు వాడుకోలేకపోతున్నామన్నారు .దీనికి సంబంధించిన నిబంధనల గురించి ఏ ఒక్క సెక్రటరీ గారికి, ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఆఫీస్ సిబ్బందికి అవగాహన లేకపోవడం వల్ల నిధులు నిరుపయోగంగా అకౌంట్లో ఉన్నాయనీ,దీనికి ఎంపీడీవో ఆఫీస్ సిబ్బంది జాప్యం చేయడం వల్ల నిధులు నిరుపయోగంగా ఉన్నాయని సర్పంచులు తెలపడం జరిగింది.. గత సర్పంచులు పనిచేసి దానికి సంబంధించిన MB లు రికార్డ్ చేసి మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ వారికి నిధులు ఇవ్వలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది.. ఈ విషయంలో కలెక్టర్



మరియు డిపిఓ గా స్పందించి ఈ సమస్యను తొందరగా పరిష్కరించాలని మండల సర్పంచ్లు కోరడం జరిగింది.

# భద్రతే ప్రాధాన్యం

- బిహెచ్ఇఎల్‌లో ఘనంగా పనిస్థల భద్రత & ఆరోగ్య దినోత్సవ వేడుకలు

**రామచంద్రాపురం, ఏప్రిల్ 28 (సిరి న్యూస్):**




రామచంద్రాపురంలోని బిహెచ్ఇఎల్ (BHEL) యూనిట్‌లో ప్రపంచ పనిస్థల భద్రత మరియు ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల్లో భద్రతపై అవగాహన పెంపొందించడం, పనిస్థలంలో భద్రతా సంస్కృతిని బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యంగా నిలిచింది.ఈ కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై. శ్రీనివాసరావు, సంగారెడ్డి ఫ్యాక్టరీల తనిఖీ అధికారి వై. శ్రీవిద్య, జీఎం (హెచ్ఆర్) డాక్టర్ సంధ్యా కార్, ఏఐటీయూసీ యూనియన్ అధ్యక్షుడు ఎస్.డి.వి. కృష్ణరాజు హాజరై, భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని, వ్యక్తిగత రక్షణ పరికరాలు (PPE) వినియోగంపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. "ఆరోగ్యకరమైన మానసిక-సామాజిక కార్యపరిసరాల సాధన" అనే ఈ ఏడాది నినాద ప్రాముఖ్యతను వివరించారు.భద్రతా పతాక ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభమై, ఉద్యోగులందరితో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. నినాద రచన, వ్యాస రచన, పోస్టర్ రూపకల్పన, ఆన్‌లైన్ క్విజ్ వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్లాంట్ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన యూనిట్లకు హౌస్‌కీపింగ్ అవార్డులు ప్రదానం చేశారు.ప్రధాన భద్రతా అధికారి కె. అరవింద్ కుమార్ మార్గదర్శకత్వంలో, భద్రతా అధికారుల సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# రాంపూర్ లో ముందస్తు బడిబాట

**రామాయంపేట, (నిజాంపేట) ఏప్రిల్ 28 (సిరి న్యూస్) మంగళవారం నాడు**

నిజాంపేట మండలం రాంపూర్ గ్రామంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్, పాలకవర్గం మరియు గ్రామస్తులతో కలిసి ముందస్తు బడిబాట నిర్వహించామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదవటం ద్వారానే విద్యార్థి సమగ్ర వికాసం జరుగుతుందని చెప్పారు. ఐదో తరగతి పూర్తయిన విద్యార్థులను గుర్తించి వారికి ఆరవ తరగతిలో ప్రవేశం తీసుకోవడం జరిగింది అని, అదేవిధంగా బయట చదివే విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారిని కూడా ఉన్నత పాఠశాలలో చదివించే విధంగా ప్రయత్నం చేశామని



తెలిపారు. బడిబాట కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, పంచాయతీ పాలకవర్గం మరియు గ్రామస్తులు పాల్గొనడం పట్ల ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ గారు మాట్లాడుతూ, రాంపూర్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కొరకు గ్రామ పాలకవర్గం శాయశక్తులా సహకరిస్తుందని, అలాగే అధిక విద్యార్హతలు మరియు అనుభవం కలిగిన ఉపాధ్యాయుల బోధన, విశాలమైన పాఠశాల ఆవరణ, ఉచిత పాఠ్యపుస్తకాలు లాంటి ఎన్నో సదుపాయాలు ప్రభుత్వ పాఠశాల ద్వారా విద్యార్థులకు సమకూర్చబడుతున్నాయని కావున గ్రామంలోని తల్లిదండ్రులందరు తమ పిల్లలను రాంపూర్ ఉన్నత పాఠశాలలోనే చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, పంచాయతి సెక్రటరీ చంద్రహాస్, ఏపీసి చైర్మన్ యాదమ్మ, ఉపాధ్యాయ బృందం ఈశ్వరయ్య, అర్జున్, నరేష్, కుమార స్వామి, మండల మాజీ కోఆప్షన్ మెంబర్ గౌస్, ఉప సర్పంచ్ ఎల్ల అనిల్, వార్డు మెంబర్లు శిరీష, మెహ్రూన్, సయ్యద్, రుచిత బాలరాజు, గ్రామస్తులు రాజు గౌడ్, యాదగిరి గౌడ్, జెల్ల శ్రీకాంత్, ఫిరోజ్, శారద, లావణ్య,అంజలి,వసంత, జైనాబ్ తదితరులు పాల్గొన్నారు.

## జోగిపేట 'ట్రాన్సిట్ హోంను సందర్శించిన జిల్లా ఎస్ పీ పంకజ్




**జోగిపేట, ఏప్రిల్ 28, (సిరి న్యూస్ ):**

జోగిపేటలోని సబ్‌జైలులో విదేశీ ఖైదీల కోసం ఏర్పాటు చేసిన 'ట్రాన్సిట్ హోంను మంగళవారం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సందర్శించారు. సోమవారం 12 మంది విదేశీ ఖైదీలను ట్రాన్సిట్ హోంకు తరలించిన విషయం తెలిసిందే. హైదరాబాద్ లోని వివిధ రకాల నేరాలకు పాల్పడి తీవ్రమైన నేర ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని ట్రాన్సిట్ హోం కేంద్రానికి తరలించారు. వారికి సౌకర్యంగా ఉందా? లేదా అన్న విషయాన్ని స్వయంగా తెలుసుకునేందుకు ఎస్పీ పరిశీలించారు. విదేశీ నేరస్తులను కట్టుదిట్టమైన భద్రతా మధ్య ప్రత్యేక వాహనాల్లో 9 మంది పురుషులు, ముగ్గురు మహిళలను జైలులో రిమాండ్‌లో ఉంచారు. తన సందర్శనకు సంబంధించి ఎస్పీ విలేకరులతో మాట్లాడేందుకు నిరాకరించారు. ఇది తమ పరిధిలోకి రాదని ప్రత్యేకంగా హైద్రాబాద్‌కు చెందిన ఆ విభాగానికి చెందిన అధికారులు పర్యవేక్షిస్తారని ఎస్పీ చెప్పారు.

## బాల్య వివాహాల నిర్మూలన కృషి చేయాలి

### సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్ గుప్తా.



**రామాయంపేట, ఏప్రిల్ 28 (సిరి న్యూస్)**

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రామాయంపేట మండలం కాట్రియాల గ్రామ సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్ గుప్తా సూచించారు. మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద బాల్యవివాహాల నిర్మూలనపై గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. బాల్యవివాహాలు చేయడం వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలు, 21 సంవత్సరాల లోపు మగ పిల్లలకు వివాహాలు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్రవంతి రాజేందర్ గుప్తా ,ఉప సర్పంచ్ బాబు నాయక్, గ్రామపంచాయతీ సెక్రటరీ ధనలక్ష్మి, అంగన్వాడి టీచర్ , గ్రామస్తులు పాల్గొన్నారు

## మున్సిపల్ కార్మికుల క్షేమమే మా బాధ్యత

### మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్




**ఆసిఫాబాద్ టౌన్(సిరి న్యూస్):**

పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ కార్మికుల ఆరోగ్యం, వారి క్షేమమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ పేర్కొన్నారు. పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా, విధుల్లో ఉన్న పారిశుద్ధ్య, ఎలక్ట్రికల్, తాగునీటి సరఫరా విభాగాల కార్మికులకు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భానుడి భగభగలతో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, ఇటువంటి సమయంలో క్షేత్రస్థాయిలో పనిచేసే కార్మికులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు పని మధ్యలో తగినంత నీరు తాగుతూ, నీరసంగా అనిపించినప్పుడు వెంటనే ఓ.ఆర్.ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ యంత్రాంగం ఎల్లప్పుడూ కార్మికులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.మున్సిపల్ కమిషనర్ గజనంద్ మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న వేళల్లో కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అనుమండ్ల స్వప్న రాణి, తనుకు భార్గవి, సాలం బిన్ అహ్మద్, దూడల లక్ష్మి, నాగు బాయ్ ఇతర మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జయంతి వేడుకల



**తూప్రాన్ ఏప్రిల్ 28 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని రామాలయం సమీపంలో అతి పురాతనమైన ఉత్తర ద్వారా శ్రీ కూర్మనాదసింహస్వామి దేవాలయంలో ఈరోజు నుండి రెండు రోజుల జయంతి వేడుకలను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు బుధవారం ఉదయం నుండి గురువారం సాయింత్రం వరకు నరసింహ స్వామికి అభిషేకాలు విష్ణు సహస్ర పారాయణం సుదర్శన హోమం స్వామివారి కళ్యాణం అన్న వితరణ కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## బాల్య వివాహాలు పై అవగాహన




**తూప్రాన్ ఏప్రిల్ 28 సిరి న్యూస్**

తూప్రాన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు బాల్య వివాహాలు సమాజానికి శాపంగా మారుతున్న నేపథ్యంలో వాటి నివారణ కోసం ప్రజల్లో చైతన్యం కల్పించడం లక్ష్యంగా మున్సిపల్ కార్యాలయం నుండి నర్సాపూర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేయించారు బాల్య వివాహం ఒక సామాజిక దురాచారం మాత్రమే కాదు అది చిన్నారుల భవిష్యత్తును నాశనం చేసే నేరం ప్రతి బాలికకు చదువు ఆరోగ్యం స్వేచ్ఛతో జీవించే హక్కు ఉంది తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్న వయసులో వివాహం చేయకుండా ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలి బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం దెబ్బతినడం విద్య మధ్యలో ఆగిపోవడం భవిష్యత్తు కోల్పోవడం వంటి అనేక సమస్యలు తలెత్తుతాయని వివరించారు ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్ డి ఓ జయ చంద్రారెడ్డి డీఎస్పీ నరేందర్ గౌడ్ తూప్రాన్ తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఎస్ఐ గంగరాజు ఐసీడీఎస్ సూపర్వైజర్లు అంగన్వాడీ సిబ్బంది ఆశా వర్కర్లు గ్రామ స్థాయిలో బాల్య వివాహాలను గుర్తించి వెంటనే అధికారులకుఎ సమాచారం అందించాలని సూచించారు బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని సమాజం మొత్తం కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు బాల్య వివాహాల నిర్మూలన కోసం చిన్నారి చేతిలో పుస్తకం ఉండాలి బాల్యం అనేది కలలు కనడానికి పెళ్లి బంధంలో పడడానికి కాదు చదువు అమ్మాయికి ఆభరణం బాల్య వివాహం ఆపితేనే సమాజానికి మంచి భవిష్యత్తు ఉంటుంది అని తెలిపారు

## మే డే స్ఫూర్తితో కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి

**సిఐటియు జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు**

**కల్వకుర్తి ఏప్రిల్ 28 (సిరి న్యూస్):**

కల్వకుర్తి పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. శ్రీనివాస్ అధ్యక్షతన మేడే సన్నాహక సమావేశం జరిగినది.సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ కల్వకుర్తి పట్టణంలోనీ సిఐటియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని మేడే ఉత్సవాల్లో ప్రతీ కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ప్రధానంగా 140 సంవత్సరాల క్రితం ఎనిమిది గంటల పని దినాల కోసం జరిగిన మహోత్తర పోరాటం వల్ల కార్మికులు అనేక హక్కులు చట్టాలు సాధించుకున్నప్పటికీ నేటి పాలకులు కార్మిక చట్టాలకు హక్కులకు భంగం కలిగించే చర్యలు చేపడుతున్నారని వాటిని రక్షించుకోవడం కోసం ప్రతి కార్మికుడు ముందుకు రావాల్సిన అవసరం ఉందని యూనియన్లు ఉన్నా లేకున్నా కార్మికుల హక్కుల కోసం జరిగే పోరాటంలో యూనియన్లతో నిమిత్తం లేకుండా ప్రతి కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హమాలీ సంఘం ,భవన నిర్మాణ కార్మిక సంఘం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వివిధ సంఘాల నాయకులు ఎన్ బాలయ్య శ్రీశైలం రాజు గౌడ్ యాదయ్య చంద్రయ్య పర్వతాలు రమేష్ రజసంగం జిల్లా ఉపాధ్యక్షులు చిలుక బాల్రెడ్డి సిపిఎం నాయకులు ఏపీ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తిలో ఉన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

**కల్వకుర్తి ఏప్రిల్ 28 (సిరి న్యూస్)**

తిమ్మరాశిపల్లి & సిలార్ పల్లి సబ్ స్టేషన్ల నిర్మాణములు తొందరగా పూర్తిచేయాలి.విద్యానగర్ కాలనీలో 33 కె.వి. ఫీడర్, సిర్సనగండ్లకు సంబందించిన కేబుల్ 2.5 కిలోమీటర్ల ఉన్నది. దీనిని వెంటనే తొలగించాలి. ఇట్టి విషయంలో శాసనభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి, కల్వకుర్తి నియోజకవర్గం లేఖ ఇవ్వడం జరిగినది. కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ లేక కాలనీ పూర్తిగా బురదమయమైనది. ఎలక్ట్రిసిటీ కార్యాలయం ప్రాంగణం నుండి డ్రైనేజీ నిర్మాణమునకు అనుమతి ఇవ్వగలరని కోరడమైనది. దీనివలన డ్రైనేజీ సమస్య పరిష్కారం అవుతుంది. ఇట్టి విషయంలో శాసనభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి, కల్వకుర్తి నియోజకవర్గం లేఖ ఇవ్వడం జరిగినది. కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో కొత్త కాలనీలు చాలా ఏర్పడ్డవి. కాబట్టి 200 పోల్స్ మరియు అవసరమైన మెటీరియల్ వెంటనే మంజూరు చేయగలరని కోరడమైనది.

# లక్షల వ్యాపారం చేసే ఫంక్షన్ హాల్ కు.. టాక్స్ రూ.40 వేలేనా..!

- **నందిగామ పంచాయతీ అధికారుల తీరుపై విమర్శలు**
- **ఇదే ఫంక్షన్ హాల్ పై దేవాలయ భూమి కబ్జా ఆరోపణలు..**
- **పట్టించుకోని రెవెన్యూ, దేవాదాయ శాఖలు.**






**రామాయంపేట, (నిజాంపేట) ఏప్రిల్ 28(సిరిన్యూస్)**

సామాన్యుడు తలదాచుకోవడానికి చిన్న ఇల్లు కట్టుకుంటే చాలు.. చట్టం, రూల్స్ అంటూ వేలకు వేలు టాక్స్ లు ఫిక్స్ చేసి, ముక్కుపిండి వసూలు చేసే అధికారులు, లక్షల రూపాయల వ్యాపారం చేసే, విలాస వంతమైన ఏసీ ఫంక్షన్ హాల్ విషయంలో మాత్రం నోరూల్స్ అంటున్నారు. పేదవాడిపై ప్రతాపం చూపే ఈ ప్రభుత్వ నిబంధనలు, ధనవంతుల దగ్గరకు వచ్చేసరికి నీరుగారిపోతున్నాయా? అన్న విమర్శలు మెదక్ జిల్లా నిజాంపేట మండలం నందిగామలో వెల్లువెత్తు తున్నాయి.

**2,722 చదరపు గజాల ఏసీ ఫంక్షన్ హాల్ కు ఏడాదికి రూ.40 వేలేనా?**

నందిగామ గ్రామ శివారులో ఉన్న "మామిడి జ్యోతి" ఏసీ ఫంక్షన్ హాల్ రామాయంపేట ఉమ్మడి మండల వ్యాప్తంగా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నిర్మాణానికి అనుమతులు పొందిన 2,722 చదరపు గజాల భారీ విస్తీర్ణంలో, సకల హంగులతో నిర్మించిన ఈ ఏసీ ఫంక్షన్ హాల్‌కు సంబంధించి పంచాయతీ కేవలం రూ. 40,000 మాత్రమే వార్షిక పన్నుగా వసూలు చేస్తుండడం గమనార్హం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఒక్కో ఫంక్షన్‌కు దాదాపు 2 లక్షల రూపాయలకు పైగా అద్దె వసూలు చేసే ఈ ఫంక్షన్ హాల్ నుంచి, నామమాత్రపు పన్ను వసూలు చేయడం వెనుక ఆంతర్యం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అనుమతులు పొందిన దానికి అదనంగా పార్కింగ్ ఏరియా, కాంపౌండ్ వాల్ కలిపి భారీ ఎత్తున నిర్మాణం జరిగినా, పన్ను విషయంలో అధికారులు చూపిస్తున్న ఈ "జాలి" వెనుక మతలబు ఏమిటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఫంక్షన్ హాల్ నిర్మాణానికి దేవాలయ భూమి కబ్జా ఆరోపణలు..?**

ఈ ఫంక్షన్ హాల్ కేవలం పన్ను ఎగవేత విషయమే కాకుండా, అంతకు మించి తీవ్రమైన ఆరోపణలు దీనిపై ఉన్నాయి. చల్మెడ తిరుమలయ్య స్వామి దేవాలయానికి చెందిన భూమిని కూడా ఈ ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం కొంతవరకు కబ్జా చేశారనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. నిర్మాణ దశ నుంచి ఈ ఆరోపణలు వస్తున్నా, అటు దేవాదాయ శాఖ అధికారులు గానీ, ఇటు రెవెన్యూ యంత్రాంగం గానీ కనీసం సర్వే చేసేందుకు కూడా ముందుకు రాకపోవడం గమనార్హం.ప్రభుత్వ భూములను, దేవాలయ ఆస్తులను కాపాడాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న ఒత్తిళ్లు ఏమిటి? సామాన్యుడిపై రూల్స్ అంటూ పన్నుల భారం మోపే అధికారులు, భారీ వ్యాపార సముదాయాలకు రూల్స్ పాటించక పోవడం ఎంతవరకు సమంజసం? ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, నందిగామ శివారులోని ఈ ఫంక్షన్ హాల్‌పై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ప్రకారం వాస్తవ పన్నును నిర్ధారించడంతో పాటు దేవాలయ భూములపై సర్వే నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**టాక్స్ విషయం ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్తా-పంచాయతీ కార్యదర్శి యాద లక్ష్మి.**

నేను నందిగామ పంచాయతీ కార్యదర్శిగా చార్జి తీసుకున్న సమయానికి మామిడి జ్యోతి ఫంక్షన్ హాల్ కు నలభై వేల రూపాయల టాక్స్ ఫిక్స్ చేసి ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిబంధనల ప్రకారం టాక్స్ ఫిక్స్ ఫిక్స్ చేసి వసూలు చేస్తాం.

# డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం

**తూప్రాన్ ఏప్రిల్ 28 సిరి న్యూస్**

తూప్రాన్ పట్టణంలో డ్రగ్స్ నివారణపై మంగళవారం ఉదయం నర్సాపూర్ ఎక్స్ రోడ్ వద్ద పోలీస్ రెవెన్యూ మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారుఈ సందర్భంగా అధికారులు పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి డ్రగ్స్ దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించారు డ్రగ్స్‌కు దూరంగా ఉండటం మంచిది ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపండి మత్తు వద్దు ఆరోగ్యమే ముద్దు అనే నినాదాలతో అధికారులు స్థానిక నాయకులు ప్రజలు ప్రతిజ్ఞ చేసి మానవహారం నిర్వహించారుఅధికారులు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యం మాత్రమే కాకుండా కుటుంబాలు సమాజం కూడా దెబ్బతింటుందని తెలిపారు అనుమానాస్పద చట్ట వ్యతిరేక కార్యకలాపాలు మీకు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారురెవెన్యూ మున్సిపల్ అధికారులు కూడా పట్టణాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు అందరూ కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్ డి ఓ జయ చంద్రారెడ్డి డీఎస్పీ నరేందర్ గౌడ్ తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి ఎస్ఐ గంగరాజు పోలీస్ అధికారులు వైద్య సిబ్బంది రెవెన్యూ అధికారులు మున్సిపల్ సిబ్బంది స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు




# బిఆర్ఎస్ పార్టీలో ముదిరాజ్ సంఘం నాయకుల భారీ చేరిక

**రామాయంపేట, ఏప్రిల్ 28 (సిరి న్యూస్)**

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ముదిరాజ్ సంఘం ముఖ్య నాయకులతో పాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. మంగళవారం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి హరీష్ రావు నివాసంలో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి నేతృత్వంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది.

**బిఆర్ఎస్ లో చేరిన ముఖ్య నాయకులు.**

మహంకాళి టెంపుల్ డైరెక్టర్, మాజీ వార్డు సభ్యుడు, రామాయంపేట ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గుడాల లింగం, సంఘం సలహాదారులు రెడ్డమైన నరేష్, నాయకులు పోచమ్మల కిషన్, దేవుని సర్వయ్య, రొయ్యల కిషన్ సహా సుమారు 50 మంది ముదిరాజ్ సంఘం నాయకులు, సభ్యులు గులాబీ కండువా కప్పుకున్నారు. హరీష్ రావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి, పార్టీ కోసం పనిచేసే వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని, వారిని అన్ని రకాలుగా ఆదుకుంటామని హరీష్ రావు హామీ ఇచ్చారు.



పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలకు, గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంటారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్టి యాదగిరి, నాయకులు చౌదరి సుప్రభాతారావు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ బాదే చంద్రం, మున్సిపల్ కౌన్సిలర్లు చౌదరి చరిత, మద్దెల మాధవి, కొక్కు ప్రవీణ్, నాయకులు ఉమామహేశ్వర్, ఎస్ కే అహ్మద్, హాస్నోద్దీన్, దోమకొండ శ్రీనివాస్, రొయ్యల నవీన్, మద్దెల రమేష్, పుట్టి స్వామి, పోచమ్మ శివయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ముదిరాజ్ బిడ్డల పొట్ట కొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- **ఉచిత చేప పిల్లల పంపిణీని అటకెక్కించిన పాలకులు.**
- **మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు..**
- **బిఆర్ఎస్‌లో చేరిన 50 మంది ముదిరాజ్ సంఘం నాయకులు**

**రామాయంపేట, ఏప్రిల్ 28 (సిరి న్యూస్)**

గత రెండున్నర సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్ బిడ్డల పొట్ట కొడుతుందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. మంగళవారం మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి నేతృత్వంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని హరీష్ రావు నివాసంలో వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి హరీష్ రావు, ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.



**రూ. 850 కోట్లతో ఉచిత చేప పిల్లల పంపిణీ చేసిన ఘనత బిఆర్ఎస్‌దే..**

గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశామని గుర్తు చేశారు. సుమారు 850 కోట్ల రూపాయలతో ఉచితంగా చేప పిల్లలను చెరువుల్లో వదిలి, మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడ్డామని వివరించారు. మరో వెయ్యి కోట్ల రూపాయలతో వలలు, వాహనాలు పంపిణీ చేసి వారిని ఆదుకున్నామని తెలిపారు.

**రిజర్వేషన్లు, బీసీ సబ్ ప్లాన్ పేరుతో కాంగ్రెస్ మోసం**

ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేరుస్తామని, 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పిందని హరీష్ రావు ధ్వజమెత్తారు. బీసీ సబ్ ప్లాన్ పేరుతో ముదిరాజ్ బిడ్డలను మోసం చేస్తున్నారని, బిఆర్ఎస్ పార్టీ మాత్రమే ముదిరాజ్ సంఘానికి, మత్స్యకారులకు అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బండ ప్రకాష్, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి,బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంటారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్టి యాదగిరి, నాయకులు చౌదరి సుప్రభాతరావు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ బాదే చంద్రం, మున్సిపల్ కౌన్సిలర్లు చౌదరి చరిత, మద్దెల మాధవి, కొక్కు ప్రవీణ్, నాయకులు ఉమామహేశ్వర్, ఎస్ కే అహ్మద్, హాస్నోద్దీన్, దోమకొండ శ్రీనివాస్, రొయ్యల నవీన్, మద్దెల రమేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

**చెరువుల్లో చేప పిల్లలు వేయక, మత్స్యకారుల జీవనోపాధిపై దెబ్బ.**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి మత్స్యకారులను విస్మరించిందని హరీష్ రావు విమర్శించారు. వర్షాలు పడకముందే టెండర్లు పిలిచి చేప పిల్లలను సిద్ధం చేసే విధానాన్ని ఈ ప్రభుత్వం పక్కన పెట్టిందని మండిపడ్డారు. ఇప్పటికీ చెరువుల్లో చేప పిల్లలు వేయకపోవడం వల్ల మత్స్యకారులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# సురక్షితం ఎక్కడ వడ్ల లోడుతో వెళ్తున్న లారీని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

- 15 మంది ప్రయాణికులకు గాయాలు
- వన్ మెన్ సర్వీస్ బస్సును అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం...

**కొల్చారం, ఏప్రిల్ 28 (సిరి న్యూస్)**





ఆర్టీసీ బస్సులలో వెళ్తే సురక్షితంగా గమ్యస్థానం చేరుతారని నమ్మకం అప్పుడప్పుడు జరుగుతున్న ప్రమాదాల వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారుముందు వెళ్తున్న వడ్ల లోడు లారీని వెనుక వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులు గాయాల పాలయ్యారు. ఈ సంఘటన మంగళవారం కొల్చారంలో చోటు చేసుకుంది. మండల కేంద్రమైన కొల్చారంలో మూతబడిన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు వద్ద మధ్యాహ్నం జరిగింది. బోధన్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు వన్ మెన్ సర్వీస్ సికింద్రాబాద్ నుంచి బోధన్ వెళుతుండగా మార్గమధ్యలో కొల్చారం ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు సమీపంలో ఎదురుగా వెళ్తున్న వడ్ల లోడు లారీని వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో బస్సులో ప్రయాణిస్తున్న మెదక్ ఎల్లారెడ్డి బోధన్ ప్రాంతాలకు చెందిన 15 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వీరిలో ఐదుగురు పరిస్థితి విషమంగా ఉంది. నాలుగు 108 వాహనాల సహాయంతో క్షతగాత్రులను మెదక్ జిల్లా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం పంపారు. ఈ బస్సులో వన్ మాన్ సర్వీస్ విధులు నిర్వహిస్తూ బస్సును అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కొల్చారం పోలీసులు కేసు నమోదు

# బిహెచ్ఇఎల్ మాక్ సొసైటీలో చెట్ల నరికివేతపై కఠిన చర్యలు





- అనుమతి లేకుండా 20 చెట్లు తొలగింపు – తాహశీల్దార్ షోకాజ్ నోటీసు
- 'సిరి' వరస కథనాలకు స్పందించిన అధికారులు

**రామచంద్రాపురం, ఏప్రిల్ 28 (సిరి న్యూస్):**

సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలంలోని బిహెచ్ఇఎల్ మాక్ (BHEL MAC) సొసైటీ పార్కులో చెట్ల అక్రమ నరికివేతపై రెవెన్యూ అధికారులు కఠినంగా స్పందించారు. అనుమతి లేకుండా సుమారు 20 చెట్లను తొలగించినందుకు సొసైటీ అధ్యక్షుడికి తాహశీల్దార్ షోకాజ్ నోటీసు జారీ చేశారు.భారతీ నగర్ డివిజన్ పరిధిలో ఈ ఘటనపై 'సిరి' దినపత్రికలో వచ్చిన వరస కథనాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. తాహశీల్దార్ ఆదేశాల మేరకు గ్రామ పాలనాధికారి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు.విచారణలో ఎటువంటి ముందస్తు అనుమతి (NOC) లేకుండానే చెట్లను నరికివేసినట్లు తేలింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెట్ల తొలగింపుకు సంబంధిత శాఖల అనుమతి తప్పనిసరి అయినప్పటికీ, వాటిని విస్మరించినట్లు అధికారులు గుర్తించారు.ఈ నేపథ్యంలో వాల్టా (WALTA) చట్టం–2002 కింద చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. మే 5, 2026 లోపు సంబంధిత పత్రాలతో హాజరుకావాలని ఆదేశించారు.నిర్దిష్ట గడువులోగా సమాధానం ఇవ్వకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





GOVERNMENT OF TELANGANA
OFFICE OF THE TAHSILDAR, RAMACHANDRAPURAM MANDAL, SANGAREDDY DISTRICT

No.B/2046 /2026 Dated: 24.04.2026.

**NOTICE**

Sub: WALTA Act - Sangareddy District & Division – Ramachandrapuram Mandal- Cutting trees illegally and unauthorized in GHMC park, BHEL MAC Society as per WALTA Act and G.O.Ms.No.15 - without No Objection Certificate - Notice Issued- Remarks/explanation called for - Reg.

Ref: 1. Adverse News published in Sriri daily News Paper with a caption of "Parks lo chetla nariki veyadam pachadananiki pedda debba" Dt:25.04.2026
2. Report of the Grama palana Officer, Ramachandrapuram Mandal Dated:25.04.2026

@@@@

With reference to the subject cited above, it is hereby informed that adverse news was published in *Siri Daily Newspaper* on 25.04.2026 under the caption *"Parks lo chetla nariki veyadam pachadananiki pedda debba"*, alleging that trees were cut by the Society Directors within the limits of Bharathi Nagar Division, BHEL MAC Society Park, without obtaining a "No Objection Certificate" (NOC) from the competent authority. Further, as per the report submitted by the Grama Palana Officer, Ramachandrapuram Village vide reference 2nd cited, it is confirmed that the Society/Association Directors have illegally cut down approximately 20 trees, aged about 20 years.

In view of the above, I hereby issued this notice to provide your explanation in this matter. You are required to clarify the reasons for cutting the trees without prior permission and to show cause as to why legal action should not be initiated against you under the provisions of the WALTA Act, 2002 and Rules, 2004.

Therefore, it is summoned to offer your explanation along with the supported documents and submit the same to the undersigned by you personally or by your authorized person on or before 5-05-2026 without fail. Otherwise the necessary action will be initiated against you as per WALTA Act, 2002.

Tahsildar & Chairman
Mandal WALTA Committee,
Ramachandrapuram (M)
TAHSILDAR
Ramachandrapuram (M)
Sangareddy Dist

To
The President (Shaik Saleem),
Brundhavanam Colony,
BHEL Employees Mac Housing Society,
Reg.No.AMC/RR/DCO/98/12,
H.No.5189, 5190, Ramachandrapuram, Sangareddy (D).

(through Mandal Girdawar for service to the concerned and submit served copy immediately)
Copy submitted to the Revenue Divisional Officer, Sangareddy for kind information.

# కారు మెకానిక్ షాప్ లో అగ్నిప్రమాదం





- బ్యాటరీ పేలుడుతో కార్లు, బైక్ దగ్ధం
- మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

**గుమ్మడిదల రూరల్, ఏప్రిల్ 28 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామ సమీపంలో ఉన్న కారు షెడ్డులో అగ్ని ప్రమాదం మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు కార్ మెకానికులు తెలిపిన ఘటన ప్రకారం అన్నారం గ్రామ సమీపంలోని సోనీ మోటర్ మెకానిక్ షెడ్‌లో నిలిపి ఉంచిన కారు బ్యాటరీ ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు తెలిపారు. అనంతరం మంటలు వేగంగా వ్యాపించి షెడ్‌లో ఉన్న వాహనాలను అంటుకున్నాయి. ఈ ఘటనలో రెండు కార్లు, ఒక మోటార్ సైకిల్‌తో పాటు షెడ్‌లోని పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. భారీ ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తుంది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికంగా ఉన్న ఎయిర్ పోర్ట్ అకాడమీ నుండి ఫైర్ ఇంజన్లు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చాయి. ప్రధాన రహదారికి పక్కనే ఉండడం మూలాన కాస్త ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడడంతో స్థానిక



# నూతన కమిషనర్ ను కలిసిన టీయుడబ్ల్యూజే నేతలు

**హైదరాబాద్ (సిరి న్యూస్) :**

రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన జి.ముకుందరెడ్డిని మంగళవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే -ఐజేయు ) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో రాష్ట్ర బాధ్యులు సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని విరాహత్ కోరారు. కమిషనర్ ను కలిసిన వారిలో టీయుడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డిలు ఉన్నారు.



# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



- గ్రామ సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ (గజిని)

**కొల్చారం, ఏప్రిల్ 28,(సిరి న్యూస్)**

కొల్చారం మండలం అప్పాజీపల్లి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ (గజిని) ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకట్ గౌడ్(గజిని) మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, దళారులను నమ్మి మోసపోవద్దని , కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చెలం నర్సింలు వార్డ్ సభ్యులు సదాల నర్సింలు, వార్డ్ మెంబెర్ మానేపల్లి సావిత్రి,కదూరి సుశీల, సదాల నర్సింలు, రామాంజం, పంచాయతీ సెక్రటరీ పణింద్ర కృష్ణ, సీఈఓ పార్టిగారి కృష్ణ, కదూరి కుమార్, తిమ్మాకాపల్లి ప్రభాకర్, తిమ్మాకాపల్లి సుధాకర్, శంకర్ గౌడ్, శ్రీకాంత్ గోడి,సురేష్, రెడ్డి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేడు హరిదాస్ పూర్ కు టీజీఐఐసీ చైర్మన్ రాక

## ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు

**కొండాపూర్ ఏప్రిల్ 28 (సిరి న్యూస్)**



ఖరీఫ్( వానాకాలం) సీజన్ సన్నద్ధతపై బుధవారం కొండాపూర్ మండలం , హరిదాస్ పూర్ పంచాయతీ కార్యాలయంలో రైతు ముంగిటిలో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి హాజరవుతున్నట్లు ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. ఈ సమావేశంలో రైతులకు పలు ప్రయోగాత్మక వ్యవసాయ ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించనున్నారు. పంటకు అవసరమయ్యే రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం,పంట మార్పిడి వలన కలిగే ఉపయోగాలను శాస్త్రవేత్తలు వివరించనున్నారు.మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలపై పలు రకాలపై సాగునీటి ఆదా, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగాటీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి విచ్చేస్తున్నట్లు ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు వెల్లడించారు. సంగారెడ్డి నియోజకవర్గ కొండాపూర్ మండల,వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మట్

## జిల్లా అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని వెల్లడి





**ఆసిఫాబాద్ (సిరి న్యూస్) :**

సమీకృత కలెక్టరేట్ భవనంలోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం ఒక ముఖ్యమైన పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల జిల్లాకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా పదోన్నతిపై వచ్చిన యువరాజ్ మార్మట్, జిల్లా కలెక్టర్ హరితను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.అనంతరం అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మట్ తన చాంబర్‌లో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధి పథంలో పయనించేలా అధికారులు ,ప్రజా ప్రతినిధుల సమన్వయంతో, అందరి సహకారంతో శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆకాంక్షించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మట్‌ను జిల్లా పౌర సంబంధాల అధికారి వై. సంపత్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి కిరణ్ కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఏఐ–ఎంఎల్‌తో వ్యాపార నిర్ణయాలకు దారి

• గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఐదు రోజుల ఆన్‌లైన్ కార్యశాల

GITAM
DEEMED TO BE UNIVERSITY

**రామచంద్రపురం (పటాన్‌చెరు), ఏప్రిల్ 28 (సిరి న్యూస్):**

వ్యాపార నిర్ణయాల్లో కృత్రిమ మేధస్సు (ఏఐ), యంత్ర అభ్యాసం (ఎంఎల్) వినియోగంపై గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ మే 25 నుంచి 29 వరకు ఐదు రోజుల ఆన్‌లైన్ కార్యశాల (ఎండీపీ) నిర్వహించనుంది. డేటా ఆధారిత నిర్ణయాలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.డిమాండ్ అంచనా, వినియోగదారుల విశ్లేషణ, మార్కెట్ విభజన, మోసం గుర్తింపు వంటి అంశాల్లో ఏఐ–ఎంఎల్ వినియోగంపై శిక్షణ ఇవ్వనున్నారు. ఆచరణాత్మక ఉదాహరణలతో పాల్గొనేవారికి అవగాహన కల్పించనున్నారు.నిర్వహణ, వాణిజ్యం, ఆర్థిక శాస్త్రం, ఇంజనీరింగ్ తదితర విభాగాల అధ్యాపకుల కోసం ఈ కార్యశాలను రూపొందించారు. డేటా ఆధారిత పద్ధతులపై ప్రాయోగిక శిక్షణ అందించనున్నారు.డాక్టర్ ఎం. కామాక్షయ్య ప్రధాన శిక్షకుడిగా వ్యవహరిస్తారు. కార్యశాల అనంతరం పాల్గొనేవారికి ఏఐ–ఎంఎల్ పద్ధతులపై అవగాహనతో పాటు, వాటిని వ్యాపార నిర్ణయాల్లో వినియోగించే సామర్థ్యం పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. నమోదు వివరాల కోసం jpaul@gitam.edu కు ఈమెయిల్ చేయాలని లేదా డాక్టర్ జోసెఫ్ పాల్‌ను సంప్రదించాలని సూచించారు.

# పున ప్రతిష్ట కార్యక్రమంలో శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామి



**పాపన్నపేట్ ఏప్రిల్ 28 (సిరి న్యూస్):**

పాపన్నపేట మండల పరిధిలోని నాగసానిపల్లి గ్రామంలో పునప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగంపేట పీఠాధిపతి శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారు రెండవ రోజు రావడం జరిగింది. గ్రామ దేవతలు దుర్గమ్మ, పోచమ్మ దేవాలయాల పున ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా స్వామివారు విచ్చేయడం సంతోషకరంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. స్వామి వారు మాట్లాడుతూ ప్రతినిత్యం ఆలయాలు ధూపం, దీపం, నైవేద్యం, లాంటి చేయడం వల్ల గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని, తద్వారా అందరు కూడా సంతోషంగా ఉంటారని అన్నారు. ఇంతటి మహా కార్యక్రమానికి భక్తులందరూ ఏకతాటిపై ఉండి గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ట లో పాల్గొనడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, భక్తులు, భక్త బృందం, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ సోషల్ మీడియా కో-కన్వీనర్ గా ప్రవీణ్



**మునిపల్లి, ఏప్రిల్ 28 (సిరి న్యూస్):**

మునిపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు పడమటి నాగిశెట్టి, ఉపాధ్యక్షుడు వీరన్న పాటిల్ ఆధ్వర్యంలో కంకోల్ గ్రామానికి చెందిన సిహెచ్ ప్రవీణ్ కుమార్‌ను మండల బీజేపీ సోషల్ మీడియా కో–కన్వీనర్‌గా నియమించారు. ఈ కార్యక్రమం స్థానిక నాయకులు, కార్యకర్తల సమక్షంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సిహెచ్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రభుత్వ పథకాలు, పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే పార్టీ బలోపేతానికి తన వంతు పాత్రను నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు.

# పెట్రోల్,డీజిల్ కు ఆందోళన వద్దు





• జిల్లాలో సరిపడ పెట్రోల్, డీజిల్ నిల్వలు

• మెదక్ ఆర్డీవో రమాదేవి

**మెదక్ ఏప్రిల్,28(సిరిన్యూస్)**

జిల్లా ప్రజలు పెట్రోల్, డీజిల్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లాలో సరిపడ పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని మెదక్ ఆర్డీవో రమాదేవి తెలిపారు.మంగళవారం మెదక్ పట్టణంలోని శ్రీనివాస పెట్రోల్ పంపును తహసిల్దార్ లక్ష్మణ్ బాబు తో కలిసి పరిశీలించారు. అదే సమయంలో 12000 లీ.ఆయిల్ ట్యాంకర్ (8000–పెట్రోల్,4000–డీజిల్) రావడం జరిగిందని,పెట్రోల్ పంపు మేనేజర్ బాల్ చందర్ ను అడిగి వాటి నిల్వలు తెలుసుకున్నారు.ప్రస్తుత పెట్రోల్ నిల్వ : 29,232 లీటర్లు ప్రస్తుత డీజిల్ నిల్వ : 26,667 లీ. నిల్వలు ఉన్నాయన్నారు.ప్రస్తుతానికిఅందరికి సరిపడా లభ్యత కలదన్నారు.కావున ఇట్టి విషయాన్ని వినియోగదారులు గమనించి కలత చెందే అవసరం లేదని సూచించారు.అనంతరం మెదక్ మండలం రాజ్ పల్లి లోని పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.గన్ని సంచుల వివరాలు, తాగునీటి సౌకర్యం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు.కాగా ఇప్పటి వరకు 1200 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామని సిబ్బంది తెలిపారు. ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని ఎలాంటి అవకతవకలకు తావులేకుండా కొనుగోలు జరిగాలని సిబ్బందికి సూచించారు.

# రంగంపేట్ గ్రామంలో రైతులు ముంగిట్లో శాస్త్రవేత్తలు

• మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి




**కొల్చారం, ఏప్రిల్ 28,( సిరి న్యూస్):**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వావిద్యాలం ఆధ్వర్యంలో జరుగుతున్న రైతులు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమలో భాగంగా వ్యవసాయ ఇంజినిరింగ్ కళాశాల కంది మండలం సంగారెడ్డి బోధన సిబంది డాక్టర్ లక్ష్మణ్ రావు మరియు డాక్టర్ నీమా కూల్చారం మండలంలోని రంగంపేట్ గ్రామంలో అన్నదాతలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణ్ రావు మాట్లాడుతు, పంటలలో యూరియా వినియోగం తగ్గించడం, రసాయన ఎరువుల వినియోగం తగ్గించి జీవ ఎరువులు వాడడం మరియు సేంద్రియ పద్ధత్తులపై వివరించడం జరిగింది. డాక్టర్ నీమా మాట్లాడుతూ పంట మార్పిడి వల్ల జరిగే మేలు, నీటి ఆదా చేయడం మరియు మార్కెట్లో గిరాకీ ఉన్న వరి పంటలపై చర్చించడం జరిగింది.అలాగే ఈ కార్యక్రమంలో సమతుల్య ఎరువుల వినియోగం పై కె.వి.కె తునికి సైంటిస్ట్ డాక్టర్ ఎం రవి కుమార్ క్లుప్తంగా వివరించారు .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరిగే స్వర్ణలత విజయ్ కుమార్ , ఉప సర్పంచ్, వార్డు మెంబెర్స్, రైతులు, మరియు హార్టికల్చర్ డిపార్ట్మెంట్ కీర్తన , వెటర్నరీ డాక్టర్ పి. ప్రియాంక, మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి, రాజశేఖర్ గౌడ్, మరియు వ్యవసాయ ఇంజినరింగ్

# బాల్యవివాహాలను అరికట్టాలి






**వెల్దుర్తి ఏప్రిల్ 28,(సిరి న్యూస్ ):**

బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్య కోరారు.ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం వెల్దుర్తి మండల స్థాయిలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టీనేజ్ ప్రెగ్నెన్సీస్ ఎల్లోప్మెంట్ కేసెస్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కిశోర బాలికలకు,వారి తల్లితండ్రులకు ఈ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు.బాల్య వివాహలు, ముందస్తు గర్భాదారణ వలన బాలికలకు ఆరోగ్య పరమైన సమస్యలు ఎదురవుతాయని, అందువలన జాగ్రత్తగా ఉండాలి అని, సోషల్ మీడియా కు దూరంగా ఉండాలని, చదువుమీద శ్రద్ధ వహించాలని సూచించారు.తెలియజేయడం జరిగినది.సే నో టు డ్రగ్స్ లో భాగంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని,మత్తు కు బానిస అయిన వారికి డి అడిక్షన్ సెంటర్స్ ఉన్నాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఉమాదేవి, ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్య, హెల్త్ సూపర్డెంట్ శిరీష, ఎస్సై రాజు, ఏపిఎం సుభాష్, సీసీలు సుల్తానా, విజయలక్ష్మీ, లక్ష్మణ్ స్వప్న, అధ్యక్షురాలు రూప, అంగన్వాడీ టీచర్స్, వివో ఏలు తదితరులు పాల్గొన్నారు.

# ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**పాపన్నపేట్ ఏప్రిల్ 28 (సిరి న్యూస్):**



మద్యం మత్తులో క్షణికావేశంలో ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని నాగ్సాన్ పల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాల గ్రామానికి చెందిన కాగితాల జహంగీర్(39) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా ప్రతి రోజు మద్యం సేవించి ఇంటికి వస్తున్నాడు. తాగుడుకు బానిస మారడంతో చిన్నపాటి అప్పులు పెరిగి అవి ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి సమయంలో మద్యం సేవించి ఓ దావత్ లో భోజనం చేసి ఇంటికి వచ్చాడు. రాత్రి ఇంటి బయటే నిద్రించాడు. మంగళవారం ఉదయం పొలం వద్ద ఉన్న ఓ చెట్టుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని అటుగా వెళ్లిన స్థానికులకు కనిపించాడు. స్థానికులు కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి తల్లి షాబేరా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# రామచంద్రపురం లో ఘనంగా యెల్లమ్మ జాతర

**రామచంద్రాపురం, ఏప్రిల్ 28, (సిరి న్యూస్):**

రామచంద్రాపురం అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ సమీపంలో ఉన్న యెల్లమ్మ ఆలయంలో నిర్వహించిన యెల్లమ్మ జాతర వేడుకలు మగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ, యెల్లమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. సంప్రదాయాలను, సాంస్కృతిక విలువలను పరిరక్షిస్తూ ఇలాంటి జాతరలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ వేడుకల్లో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య కురుమ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పరమేష్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, బల్ల నర్సింగ్, చరణ్, రాములు తదితరులు పాల్గొన్నారు.



# జిండో మిరాకిల్
# గంటసేపు సముద్రం చీలుతుంది



చూడగలగాలే గానీ ఈ ప్రకృతి అనేక వింతలను మన కళ్ళముందు ఉంచుతుంది. అలాంటిదే దక్షిణ కొరియాలోని జిండో సముద్రంలో సంభవించే ఒక అరుదైన ప్రకృతి వింత . దీని గురించి ఎప్పుడైనా విన్నారా..? ఈ ప్రాంతంలో సముద్రం రెండు భాగాలుగా విడిపోయి, ఒక అద్భుతమైన ఇసుక దారిని ఏర్పరుస్తుంది. నమ్మడానికి ఆశ్చర్యాన్ని కలిగించిన అక్కడ దీని ప్రత్యేకతే ఇది. అసలు సముద్రం రెండుగా ఎందుకు చీలుతుందో తెలుసుకుందాం రండీ..

ఈ అసాధారణ దృశ్యం జిండో ద్వీపం నుండి మోడో ద్వీపం వరకు కనిపిస్తుంది. ఏడాదికి కేవలం రెండుసార్లు అది కూడా గంటసేపు మాత్రమే. సముద్రం విడిపోయి ప్రజలు నడిచి వెళ్లడానికి వీలు కల్పిస్తుంది. ఇదే జిండో మిరాకిల్. ఈ అద్భుతమైన టైడల్ ఫెనామినా కారణంగా జిండో, మోడో దీవుల మధ్య కొంత సమయం పాటు నేరుగా నడిచి వెళ్లడానికి వీలవుతుంది. ఈ అద్భుతాన్ని చూసేందుకు వేలాది మంది ప్రజలు ప్రపంచం నలుమూలల నుండి తరలివస్తారు.

జిండో ద్వీపం దక్షిణ జియోల్లా ప్రావిన్స్‌లో ఉంది. మోడో ద్వీపం దానికి ఆగ్నేయంగా ఉంది. ఈ రెండు దీవుల మధ్య సాధారణంగా 2.8 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇది పసిఫిక్ మహాసముద్రపు టైడల్ బేసిన్‌కు చాలా దగ్గరగా ఉండడం వల్ల, చంద్రుని గురుత్వాకర్షణ శక్తి ప్రభావం ఇక్కడ చాలా ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల కొన్ని ప్రత్యేక సమయాల్లో సముద్ర మట్టం విపరీతంగా పడిపోతుంది. సముద్ర మట్టం బాగా పడిపోయినప్పుడు రెండు దీవుల మధ్య ఉన్న సముద్రం లోపల దాగి ఉన్న ఇసుక మార్గం బయటపడుతుంది. ఈ మార్గం సుమారు 40 మీటర్ల వెడల్పు వరకు ఉంటుంది. ఇది పూర్తిగా బయటపడటానికి 1 గంట సమయం పడుతుంది. ఆ తర్వాత సముద్రం తిరిగి తన సాధారణ స్థితికి వస్తుంది. ఈ సహజసిద్ధమైన వంతెనను స్థానికులు మోషే మిరాకిల్ అని పిలుస్తారు.

ఈ అద్భుత దృశ్యం సంవత్సరానికి రెండుసార్లు సాధారణంగా వసంతకాలంలో, వేసవి ప్రారంభంలో సంభవిస్తుంది. ఈ సంఘటనను పురస్కరించుకుని జిండో స్థానికులు "ఫెస్టివల్ ఆఫ్ ది సీ రోడ్" (సముద్ర రహదారి పండుగ)ను నిర్వహిస్తారు. ఈ పండుగ సమయంలో సందర్శకులు ఈ తాత్కాలిక సముద్ర మార్గం గుండా నడుచుకుంటూ జిండో నుంచి మోడో ద్వీపానికి వెళ్లవచ్చు. ఈ మార్గంలో నడుచుకుంటూ వెళ్లే అనుభవం అద్భుతంగా ఉంటుంది. చుట్టూ ఉన్న సముద్రం, ఆకాశం అందాలు మనసును ఆకట్టుకుంటాయి. ఈ పండుగలో సాంప్రదాయ జిండో జానపద నృత్యాలు, సంగీత ప్రదర్శనలు, స్థానిక వంటకాల ప్రదర్శనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. ఇది పర్యాటకులకు కొరియా సంస్కృతిని అనుభవించడానికి ఒక గొప్ప అవకాశం.

జిండో మిరాకిల్ ఒక ప్రత్యేకమైన పర్యాటక ఆకర్షణగా మారింది. సముద్రం విడిపోయే దృశ్యం, ఆ మార్గం గుండా నడవగల అవకాశం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఇది ప్రకృతి శక్తికి, మానవ అద్భుతానికి నిదర్శనంగా నిలుస్తుంది. ఈ అద్భుతాన్ని అనుభవించడానికి ముందుగానే ప్రణాళిక చేసుకోవడం ముఖ్యం. ఎందుకంటే ఇది చాలా పరిమిత సమయం పాటు మాత్రమే జరుగుతుంది. జిండో మిరాకిల్, కేవలం ఒక సహజ దృగ్విషయం మాత్రమే కాదు, స్థానిక సంస్కృతి, చరిత్రతో ముడిపడి ఉన్న ఒక వేడుక. ఇది దక్షిణ కొరియా అరుదైన సహజ సౌందర్యానికి ప్రతీకగా నిలుస్తుంది.






# పొట్టిగా ఉన్నారా ?
## ఐతే ఈ డ్రెస్సింగ్ టిప్స్ మీకోసమే..

ఫ్యాషన్ ప్రపంచంలో దూసుకుపోవాలంటే తెల్లగా నిగనిగలాడే చర్మం, నల్లగా మెరిసిపోయే జుట్టు, ఎట్రాక్ట్ చేసే ముఖ సౌందర్యం మాత్రమే కాదు.. ఆకర్షణీయమైన పర్సనాలిటీ కూడా చాలా అవసరం. ఎంత అందంగా ఉన్నా పొడుగ్గా ఉంటేనే అందం, ఆకర్షణ. అన్నీ బావుండి పొట్టిగా ఉంటే నలుగురిలో ఇబ్బందిగా ఉంటుంది. పొడుగ్గా ఉండే వాళ్లు ఎలాంటి డ్రెస్ వేసినా చూడచక్కగా కనిపిస్తారు. మార్కెట్ లోకి వచ్చినా ఎలాంటి ట్రెండ్ అయినా ఇట్టే ఫాలో అయిపోవచ్చు. కానీ ఎత్తు తక్కువగా ఉండేవాళ్లు ఏ తరహా ఫ్యాషన్స్ నప్పుతాయో తెలియక సతమతమవుతుంటారు. అలాంటి వాళ్ల కోసమే ఇక్కడ కొన్ని టిప్స్ అందిస్తున్నాం. వెంటనే ఈ టిప్స్ ఫాలో అయిపోయి మీరు కూడా నలుగురిలో హుందాగా కనిపించేయండి. పొట్టివాళ్లూ గడుసువాళ్లు అని మరోసారి నిరూపించండి.

పొట్టిగా ఉన్నవాళ్లు స్కర్ట్స్ వేసుకుంటే పొడవుగా కనిపిస్తారనేది నిజమే. కానీ పొట్టిగా ఉన్న స్కర్ట్స్ కాకుండా పాదాల వరకు ఉన్న స్కర్ట్స్ ధరించడం వల్ల పొడవుగా కనిపిస్తారు. కాబట్టి ఇకపై లాంగ్ స్కర్ట్స్ కి ప్రిఫర్ చేయండి. అందంగా పొడవుగా ఆకట్టుకోండి. ఇంకా పొట్టిగా ఉన్నవాళ్లు పెద్ద పెద్ద బెల్ట్ లు, త్రీ ఫోర్త్ జీన్స్, షేడెడ్ ప్యాంట్స్, పెద్ద ప్రింట్స్ ఉన్న స్కర్ట్స్ కి దూరంగా ఉండాలి. వీటి వల్ల ఎదుటివాళ్ల చూపు మీరు పొట్టిగా ఉన్నారని తెలియజేస్తుంది. ఎల్లప్పుడూ మీ ప్యాంటు పైకి ధరించండి. ఇలా ధరించడం వల్ల మీ మొండెం నాజూగ్గా, కాళ్లు పొడవుగా కనిపిస్తాయి. అంతే కాదు మీ పొట్ట, తొడలు పూర్తిగా సన్నగా కనిపిస్తాయి బెల్ట్ ధరించడం కూడా మంచి ట్రిక్. ఎల్లప్పుడూ సన్నని బెల్ట్ ఎంచుకోండి. లేకపోతే, లుక్ పూర్తిగా తప్పు అవుతుంది. మీరు పొడవుగా కనిపించడానికి వినెక్ డ్రెస్సులు ధరించండి. దీంతో మీరు నాజూగ్గా కనిపిస్తారు. స్థూలకాయాన్ని కూడా తగ్గించి నాజూగ్గా కనిపించేలా చేస్తుంది. పెద్ద వెడల్పు ఛాతీ పరిమాణాలు ఉన్నవారికి, మెడ కొద్దిగా పైకి ఉండేలా చూసుకోండి.

అలాగే పొట్టిగా ఉన్నవాళ్లు అన్ని రకాలుగా చాలా కేర్ తీసుకోవాలి. హ్యాండ్ బ్యాగ్స్ నుంచి డ్రెస్సింగ్ వరకు ప్రతి విషయంలో కేర్ తీసుకోవాలి. పెద్ద హ్యాండ్ బ్యాగ్స్ ఎంచుకోవడం వల్ల మీరు పొట్టిగా కనిపించే అవకాశం ఉంది. కాబట్టి ఎత్తు తక్కువగా ఉన్నవాళ్లు పెద్ద పెద్ద వస్తువులకు దూరంగా ఉండాలి. దీనివల్ల మీరు పొట్టిగానే కాదు లావుగా కనిపించే అవకాశం ఉంది. కాబట్టి చిన్న పర్స్, క్లచ్ తీసుకుంటే మంచిది.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.